కథా నిలయం
శ్రీకాకుళం

Entered

ఆదివారం
ప్రజాశక్తి
జనవరి 9, 2005

చైనా బజార్

హ్యాపీ బర్త్‌డే

(9-1-2005 నుంచి
15-1-2005 వరకు)

మేఘన
4సం॥, 9.1.2001
హిమలక్ష్మి-శ్రీధర్‌కుమార్
విశాఖపట్నం

ప్రవళిక-పాండురంగ
4సం॥,9.1.2001-3సం॥,9.1.2002
విజయలక్ష్మి-రామిరెడ్డి
హనుమాన్‌పేట-విజయవాడ

తేజేశ్వరరెడ్డి
2సం॥, 9.1.2003
లక్ష్మీదేవి-శ్రీనివాసరెడ్డి
రామకృష్ణాపురం-విజయవాడ

శ్రావణి
జనవరి-9
సమలత-వెంకటరమణ
విశాఖపట్నం

స్వాతిశ్రీ(చిక్కి)
6సం॥, 10.1.1999
అనంతలక్ష్మి-సుబ్రమణ్యం
గూడాల-తూ॥గో॥

వాసంతి
7సం॥,10.1.1998
శ్రీవాణి-సురేందర్‌రావు
గడ్డంపల్లి-మ॥నగర్

ఆదిత్యగౌడ్
జనవరి-11
ఉమావతి-సిద్దయ్య
చేర్యాల-వరంగల్

స్వీటీ
జనవరి-11
జ్యోతి-వెంకటరావు
విశ్వేశ్వరాయపురం-తూ॥గో॥

సురేంద్రనాథ్‌రెడ్డి
7సం॥, 12.1.1998
విజయకుమారి-లక్ష్మీనారాయణరెడ్డి
హనుమయ్యనగర్-గుంటూరు

మానస
5సం॥, 12.1.2000
రమణమ్మ-వెంకటేశ్వర్లు
మామునూరు క్యాంప్-వరంగల్

మనీష
6సం॥, 12.1.1999
అంజనమ్మ-చిన్నఅంజనేయులు
వనపర్తి-మ॥నగర్

ఎస్.కె. అజీజ్
4సం॥, 12.1.2001
జీజాన్‌బి-మస్తాన్‌వలి
ఖానాపురం-ఖమ్మం

ఆబూబకర్ సిద్దిఖ్
3సం॥, 13.1.2002
అఫ్సరున్నీసా-రఫీఖ్
భవానీనగర్-హన్మకొండ

అవినాష్
1సం॥, 13.1.2004
జయంతి-శ్రీనివాస్
ఆదర్శనగర్-కరీంనగర్

సత్విందర్‌సింగ్
1సం॥, 14.1.2004
జగదీష్‌కౌర్‌గ్రంధి-గులాబ్‌సింగ్‌గ్రంధి
బుక్తాపూర్-ఆదిలాబాద్

వీణ-వినోద్
10సం॥, 14.1.1995
ఈశ్వరమ్మ-అంజయ్య
మారుతీనగర్-హైదరాబాద్

అభిహాస్
1సం॥, 14.1.2004
విజయలక్ష్మి-సుబ్బయ్య
లక్ష్మీనగర్‌కాలనీ-మ॥నగర్

రాజేష్
4సం॥.14.1.2001
వనజ-రమేష్
ఉండవల్లి-గుంటూరు

అమూల్య
1సం॥, 15.1.2004
లలిత-శ్రీనివాస్
అశోక్‌నగర్-గోదావరిఖని

అమ్ములు
జనవరి-15
స్వరూప-రవికుమార్
అశోక్‌నగర్-గోదావరిఖని

సాయిరాం
6సం॥, జనవరి-1999
రమాదేవి-సత్యనారాయణ
పాలకుర్తి-వరంగల్

దివ్యజ్యోతి
4సం॥.జనవరి-2001
విజయలక్ష్మి-వెంకటేష్
తాళ్లపల్లి-రంగారెడ్డి

నిఖిత
3సం॥, జనవరి-2002
అలివేలుమంగ-దస్తయ్యగౌడ్
మారేపల్లి-మెదక్

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం

కొత్త(ఏడాది)కి స్వాగతం

డిసెంబర్ 26వ తేదీ కవర్‌స్టోరీ బాగుంది. శాంతియుత ప్రపంచాన్ని వాగ్దానం చేసే కొత్త సంవత్సరానికి మనం స్వాగతం పలుకుదామంటూ ఇచ్చిన సందేశం బావుంది. కొత్త సంవత్సర వేడుకల ప్రారంభం, తెలుగువారి సంప్రదాయ పద్ధతులలో శుభాకాంక్షలు తెలుపుతారని వివరించారు.

–ఈడా శివప్రసాద్, కంకిపాడు

రౌండప్ బాగుంది

ఆదివారం అనుబంధం ముఖచిత్రం 2005కి స్వాగతం పలికింది. 2004 రౌండప్ ఇచ్చిన తీరు బాగుంది. అంతర్జాతీయం, జాతీయం, రాష్ట్రీయం అన్న విభాగాలతో మొత్తం ఎనిమిదిపేజీల్లో యావత్ ప్రాపంచిక విషయాలనూ డేట్‌ల వారీగా చిత్రాలతో వివరించుతూ ప్రచురించడం బాగుంది. ఈ వారపు కార్టూన్ కదంబంలో వచ్చిన వ్యంగ్య చిత్రాలు మమ్మల్ని ఆలోచింపజేశాయి.

–సిరిపురపు రామకోటేశ్వర రావు, ఎనికేపాడు, విజయవాడ రూరల్

ఆకట్టుకుంది

ఆదివారం అనుబంధంతో పాటు మధ్యపేజీలుగా ఇచ్చిన "2004 రౌండప్" విలక్షణంగా ఉంది. ఈ రౌండప్‌లో 2004లో జరిగిన ముఖ్యసంఘటనల సంక్షిప్త సమాచారం ఆకట్టుకున్నది. ఎనిమిదిపేజీల సమాచారంతో ఆసక్తిగా చదివింపజేసింది.

–ఎం డి ముస్తఖీమ్, కొల్లాపూర్, మహబూబ్‌నగర్‌జిల్లా

యాభైఏళ్ళ కళాఖండం

యాభైఏళ్ళ కళాఖండం 'పథేర్ పాంచాలి' సృష్టికి మూలమైన సత్యజిత్‌రే మన దేశ అద్భుత కళాకారుడు, దర్శకుడు. ఆ కళాఖండం అప్పుడూ ఇప్పుడూ నిజంగా ఒక అపురూప కళాఖండంగా మిగిలిపోవడం మనకు గర్వకారణం.

–మేడూరి సత్యనారాయణ, ఖైరతాబాద్, హైదరాబాద్

ఆరోగ్యం పై వ్యాసం

సుగరువ్యాధి బారినపడి అనుభవిస్తున్న రోగులకు 26వ తేదీ ఆదివారం అనుబంధంలోని వ్యాసం ఎంతో ఉపయోగకరంగా ఉంది. మధుమేహ వ్యాధి గురించి క్లుప్తంగా అర్థమయ్యేలా విశ్లేషణగా రాసినది బాగుంది. డాక్టర్‌గారికి ధన్యవాదాలు.

–అన్నే వెంకటకృష్ణారావు, గన్నవరం, కృష్ణాజిల్లా.

అనుబంధం బాగుంటోంది

ప్రతీ ఆదివారం మీరు ప్రచురిస్తున్న అనుబంధం బాగుంటోంది. కవర్‌స్టోరీలు విజ్ఞానదాయకంగా ఉంటున్నాయి. ఇప్పుడు వస్తున్న శీర్షికలతో పాటుగా భౌతికశాస్త్రం, రసాయనికశాస్త్రంలో ఆయా శాస్త్రవేత్తలు చేసిన కృషిని వివరిస్తూ, వారి జీవితవిశేషాలతో కూడిన వ్యాసాలు ప్రచురిస్తే ఇంకా బాగుంటుందని నా ఉద్దేశ్యం.

–కె భరత్‌కుమార్, శాంతినగర్, ఖమ్మం.

వెలుగు దివ్వె

సినిమాగా 'రియల్‌స్టోరీ'

28-12-2003 ఆదివారం సంచిక 'రియల్‌స్టోరీ' శీర్షికలో ప్రచురించిన "వెలుగుదివ్వె" స్టోరీ "వైట్‌ల్యాండ్" సినిమాగా హిందీలో చిత్రించబోతున్నారు. దృష్టిలోపం ఉన్నప్పటికీ స్వయంకృషితో సర్పంచిగా ఎన్నికై ఎన్నో ప్రశంసలు పొందిన సుధాపాటిల్ జీవితాన్ని 'జయంత్ గిల్టర్' దర్శక నిర్మాతగా తెరకెక్కిస్తున్నారు. సుధాపాటిల్ పాత్రను 'లగాన్' సినిమా హీరోయిన్ గ్రేసీసింగ్ నటించనున్నారు. గుజరాత్‌లో సుధాపాటిల్ స్వగ్రామం లాంగాలో చిత్ర ప్రారంభ సన్నివేశాలను త్వరలో చిత్రీకరించబోతున్నారు. ప్రజాశక్తి, ఆదివారం అనుబంధంలో పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ సుధాపాటిల్ విజయగాథను 'రియల్‌స్టోరీ' గా రాశారు.

–సందేదెస్క్, హైదరాబాద్

మనలో మాట

నంగి నంగి... గంగిరెద్దు!

గంగిరెద్దుకీ సంక్రాంతికి... ఎండకూ సూర్యునికి ఉన్నంత విడదీయలేని సంబంధం మరి!

అందుకే గంగిరెద్దు అనంగానే సంక్రాంతి పండుగ, సంక్రాంతి అనంగానే గంగిరెద్దు ఇట్టే గుర్తొచ్చేస్తాయి.

ఈ గంగిరెద్దు పండుగపొద్దుల్లోనే కాదండీ... మన సాహిత్యవీధుల్లోనూ వీరవిహారం చేస్తుంది. ఎటొచ్చీ పోలికల శాస్త్రాన గంగిరెద్దుకొచ్చిన స్థానం బహు విచిత్రమైంది సుమండీ !

ఏడాదిపొడువునా ఎద్దుచేత నానా చాకిరీ చేయించుకుంటామా...బళ్ళకు కట్టి ఎక్కి కూచుంటామా...సంక్రాంతి లాంటి పండుగలకు నాయనా బసవన్నా...దేవుడా అని సాగిలపడతామా...

సామెతల్లో, పొడుపుకథల్లో, సింబాలిజంలో మాత్రం "నంగినంగి గంగిరెద్దులా తల ఊపాడు", "వాడొట్టి డూడూ బసవన్న" అని కించపరిచే ప్రతీకగా వాడేస్తాం.

కానీ కొందరికి...

ఈ పోలిక ప్రకారం ఇతరులను చూడాలని, చెలాయించాలని ఎంత కోరికో...

ఈ రైతులు, కార్మికులు, ఉద్యోగులు, సమస్త ప్రజానీకం...ఆ మాటకొస్తే తన కింద అన్ని దేశాలు ఇలా డూడూ బసవన్నల్లాగా వుండాలని ప్రపంచాధీశుడికి ఎంత కోరికో...చెప్పలేం.

అంతటి పేరాశాపరులు తమ పేటెంటు హక్కుగా ఈ ప్రకృతి కూడా వారి ఆధిపత్యం ముందు డూడూ బసవన్నలా తలాతోకా ఆడించాలనుకుంటారు.

ఎంత గంగిరెద్దయినా దానికీ కోపం వచ్చిందంటే కుమ్మిపడేస్తుంది కదా...

నిన్నటి సునామీలాగా !!!

❖

ఈ సంచికలో . . .

ఓరా! ...	3
కార్టూన్ కదంబం... ...	4
కవర్ స్టోరీ ...	5
జీవనశైలి ...	10
బాలల కథ ...	11
బాలనేస్తాలు ...	12
ఇంతి సంగతి ...	16
కచేరి ...	17
ఆరోగ్యం ...	18
పుస్తక పరిచయం ...	20
న్యాయసలహాలు ...	24

ఇంకా...

నేను ఎందుకు పారేస్తాను నాన్నా

కథ ... 8, 9

స్వయం కృషి

రియల్ స్టోరీ ... 14, 15



'విదురాక్షేత్రం'

టూరిస్ట్‌గైడ్ . . . 21

కార్టూన్ బొమ్మల్లో జీవం ఉండాలి

కళాసాహితి . . . 22, 23

ఔరా!

వారెవ్వా...బీహారు మూషికా...!!



మనుషులకు డబ్బు దాహం డబ్బు దాహం అంటారు కదా ! అందుకని మనుషుల బుద్ధి తమకు దేనికనుకున్నామేమో...బీహార్‌లోని పాట్నా ఎలుకలు "డబ్బాకలి డబ్బాకలి" అంటున్నాయి. విత్‌డ్రా కౌంటర్‌కి వెళ్ళి అక్కడి నుంచి క్యాష్‌కౌంటర్ల ద్వారా స్ట్రాంగ్ రూంకి వెళ్ళి డబ్బు కట్టల్ని ముట్టడించడమంటే లేటనుకున్నాయనుకుంటా... అవి ఏకంగా పాట్నాలోని ఒక ఎటియమ్ సెంటర్‌లోని డబ్బు కక్కే మిషన్‌లోకెళ్ళాయి. ఎంచక్కా తీరిగ్గా కరెన్సీ నోట్లను ఆరగించాయి. సుమారు ఓ రెండుమూడు గంటల్లో ఇరవైఐదువేల రూపాయలు తినేశాయి !!!

సిగరెట్ల నైవేద్యం

ధూపం, దీపం, గోల్డ్‌ఫ్లేక్, మార్ల్‌బొరో నైవేద్యం సమర్పయామీ అనంటారు గామోసు ఆ సూరత్ చుట్టుపక్కల దైవభక్తులు ! గుజరాత్‌కు చెందిన సూరత్‌లోని కటర్‌గ్రామ్‌లో ఉన్న శ్రీ మమదేవ్ దేవాలయంలోని దేవుడికి కొబ్బరికాయలతో పాటు అగరొత్తుల బదులుగా ఇలా సిగరెట్లు ఇవ్వడం ఓ వింత ఆనవాయితీగా వస్తోంది. ప్రతీరోజు ఆ గుడి వద్ద దాదాపు 100పేకెట్లు గోల్డ్‌ఫ్లేక్, మార్ల్‌బొరో సిగరెట్ల పేకెట్లు అమ్ముడవుతున్నాయని ఘనంగా చెప్పుకుంటున్నారు కూడా ! శనివారం, పండుగరోజుల్లోనైతేనా...అని ఇంకా తన్మయత్వంతో చెప్పబోతారు ఆ మహాభక్తులు. మా మమదేవ్ భగవానుడు ఏదిచ్చినా స్వీకరిస్తాడని అంటున్నారు. హమ్మయ్య...ఇన్నాళ్ళకు మన కన్యాశుల్కం గిరీశానికి ఇష్టమైన దేవుడు కనబడ్డాడు !!

డైవోర్సీ డాడీలాశ్రమం!

కలికాలం కలికాలం అని శాపనార్థాల భాష ఉపయోగించి లాభంలేదు భాయీ ! వేదాల్లో రాసేవుంది ఇప్పుడిలా జరుగుతుందనీ, బ్రహ్మంగారు కాలజ్ఞానంలో ఎప్పుడో చెప్పారనీ ఊకదంపుడూ పనికిరాదు అన్నయ్యలూ. ట్రెండ్ మారింది. విధవాశ్రమాలనీ, అనాథ, శిశు, మహిళా సంరక్షణాలయాలనీ ఇన్నాళ్ళూ ఉన్నాయి కదా ! ఇప్పుడు విడాకులు పొంది వీధినపడ్డ భర్తేశ్వరావులకు 'షెల్టర్ ఫర్ డైవోర్సడ్ డాడ్స్' అనేవి ఏర్పడుతున్నాయి. ఈ మధ్యనే ఇటలీలో మొట్టమొదటి 'ఆశ్రమం' వెలిసింది. 'ఇకనుంచైనా తండ్రులందరూ విలన్లు, తల్లులు హీరోయిన్లు అని మూకుమ్మడి స్టాంపింగ్ ఆపాలి' అని సెపరేటెడ్ డాడ్స్ గ్రూప్ అధ్యక్షుడు ఎర్నెస్టో ఇమాన్యుయేల్ ఉద్ఘోషిస్తున్నారు.



కార్టూన్ కదంబం


వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు సార్ రాజ్యలక్ష్మి ఎక్కడా అని అడుగుతున్నారు


బాబూ, నన్నొదిలేయ్...
ఢిల్లీ
పివి ఆత్మగౌరవంపై పార్లమెంటులో పోరాడుతా: బాబు


సిఎం గారే, నగరబాట కదా...
వైయస్ నగరబాట



చైనా బజార్

వల్లభనేని సురేష్

మనం "గ్లాస్ కర్టెన్ ఎకానమీ" అని ఒకానొక విచిత్ర ఆర్థికవిధానం గురించి విన్నాం. ప్రస్తుతం దానితోపాటుగా "గ్లాస్ కర్టెన్ కన్స్యూమరిజం" అనే మాట కూడా చెప్పుకోవాలి. ఎన్నో వస్తువులు మనల్ని ఎంతో ఆకర్షిస్తాయి. కానీ అవి ఒక గాజుతెర వెనుక ఉంటాయి. అవి ధర రీత్యా లేదా మన కొనుగోలుశక్తి రీత్యా మనకు అందని, మనం అందుకోలేని "దూరపు దగ్గర్లోనే" ఉంటాయి. సరిగ్గా ఈ స్థితిలో మనల్ని ఆకర్షించిన వస్తువులు చౌక ధరకు కుప్పలుపోసి అమ్మే మార్కెట్లు వెలిశాయి. గతంలో అలాంటి మార్కెట్లకే పేరులున్నా ఇప్పుడు మాత్రం "చైనా బజార్" అనే బోర్డుతో మన ముందుంటున్నాయి.

నేడు ఎక్కడ చూసినా "చైనా బజార్" పేరు వినబడుతోంది. చైనా గిన్నె, చైనా లైట్, చైనా బల్బు మొత్తం చైనానే. మొత్తం చైనా మార్కెట్‌తో నిండిపోయింది. అన్నం తినే పళ్ళెం దగ్గర నుంచి ఊడ్చే చీపురు కూడా చైనానే ! ఈ పేరు నేడు మధ్య తరగతి ప్రజలను ఎక్కువగా ఆకర్షిస్తోంది. దీంతో రాష్ట్రంలోని ప్రతి పట్టణంలోనూ ఈ చైనా బజార్లు వెలిశాయి. ఇక్కడ అన్నీ చైనా వస్తువులే అని చెబుతూ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. చైనాబజార్లలో మనకు అవసరమైన నిత్యావసర వస్తువులన్నీ ఉంటాయి. రేట్లు మాత్రం చాలా తక్కువ అనే లేబుల్ వేసి ఉంటాయి. ఏదైనా సరే 65, 130 రూపాయలు, 49, 99 రూపాయలు ఇవే రేట్లు ఫిక్సడ్. వీటిని మాత్రం మార్చటానికి లేదు. ఈ బజార్లలో టబ్బులు, బట్టలు, చెప్పులు, స్టీలుపాత్రలు, గాజు వస్తువులు, గృహోపకరణాలు ఒకటేమిటి అన్ని రకాలూ ఉంటాయి. రాష్ట్రంలో ఈ పేరుతో మార్కెట్లు విరివిగా వెలిశాయి. ఒక్క హైదరాబాద్ నగరంలోనే కాదు. విజయవాడ, గుంటూరు, విశాఖ, తిరుపతి, నెల్లూరు,

వరంగల్... రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని చిన్నా పెద్ద నగరాల్లో ఈ మార్కెట్లు వెలిశాయి. రేట్లు తక్కువ అనిపించటం వల్ల ఈ మార్కెట్లు మధ్యతరగతి ప్రజలను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి. చైనా అనే పేరు కనబడటంతోనే తక్కువ రేటుతో ఎక్కువ మన్నిక గల వస్తువులు దొరుకుతున్నాయి అనే ఒక నమ్మకంతో ఎక్కువమంది ఈ మార్కెట్లను ఆశ్రయిస్తున్నారు. వీటికి తోడు ఈ మధ్యకాలంలో చైనాలో దేవతల బొమ్మలు, డ్రాగన్‌బొమ్మలు, చైనా ఉంగరాలు నేడు మన రాష్ట్ర మార్కెట్లో అమ్ముడుపోతున్నాయి. వీటిని ధరిస్తే వ్యాధులు దరిచేరవనే ప్రచారం కూడా ఎక్కువగానే జరుగుతోంది. దీంతో చైనా మార్కెట్‌కు, చైనా వాస్తు, జాతక, మూఢనమ్మకాల వస్తువులకు క్రేజ్ మరింత పెరిగింది. ఈ ప్రచారంతోనే వ్యాపారస్తులు సొమ్ము చేసుకుంటున్నారు.

చైనా పేరే ఎందుకు...?!

1996 నుండి ఈ పేరు చాలా ఎక్కువగా వాడుకలోకి వచ్చింది. సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో స్వేచ్ఛామార్కెట్‌కు రెక్కలు వచ్చాయి. ఏ దేశపు వస్తువులైనా ఎన్ని దేశాల సరిహద్దుల్లైనా దాటి స్వేచ్ఛగా అమ్ముకోవచ్చు అనే సౌకర్యం వ్యాపారానికి వచ్చింది. ఈ సౌకర్యం ఎక్కువగా తమ వస్తువులతో దురాక్రమణ చేయగల అత్యంత ధనిక దేశాలకు మరింత సౌకర్యం. స్వేచ్ఛావాణిజ్యం పేరుతో యథేచ్ఛ దోపిడీ చేసుకోవచ్చు. అది వేరే సంగతి. ఇంతకుముందు విదేశీ వస్తువులకు కస్టమ్స్ సుంకం, ప్రభుత్వ అనుమతి అనే గేట్లు అడ్డుండేయి. వాటిని తప్పించుకుని వచ్చేవాటికి "స్మగుల్డ్ గూడ్స్" అనీ... వాటిని కొనుక్కోవడం ఒక క్రేజ్‌గా ఉండేది. ఇప్పటికీ కొన్నిచోట్ల "కస్టమ్స్ నోటిఫైడ్ షాప్" అనేవి హైదరాబాద్, విజయవాడ, విశాఖ పట్టణాల్లో ఉన్నాయి. ఇప్పుడంత కష్టం అక్కర్లేకుండానే ఏ దేశపు వస్తువులైనా ఏ దేశం లోపలికైనా వచ్చేయవచ్చు కదా ! అమ్మకానికి బజారుతీరి ఉండొచ్చు కదా ! ఈ నేపథ్యంలో చైనా పేరు భారతదేశంలో మరింత ప్రాచుర్యంలోకి వచ్చింది. చైనా శ్రామికవర్గ విప్లవ విజయం సాధించిన అభివృద్ధి వస్తువుల ఉత్పత్తి, నాణ్యతల మీద ఉంది. కాబట్టి అక్కడ తయారైన వస్తువులకు ప్రపంచమంతా గిరాకీ ఉంటుంది. ఇదే తరుణంలో అమెరికా, జపాన్, సింగపూర్ ఇలా ఒకటేమిటి ఏ దేశం ఏ వస్తువులకు ప్రసిద్ధో అటువంటి వస్తువులపై అదే పేరును వాడుకోవడం ఎక్కువైంది. దీనికి తోడు అమెరికాలో కూడా 80 శాతం మంది చైనా వస్తువులనే ఉపయోగిస్తున్నారనే ప్రచారం బాగా జరిగింది. ఫ్రీ మార్కెట్ వ్యవస్థ రావడంతో వర్ధమాన దేశాలపై అభివృద్ధి చెందిన దేశాల వస్తువుల డంపింగ్ ఎక్కువైంది. దీంతో ఒక్క చైనా వస్తువులకే కాదు. అన్ని దేశాల వస్తువులకూ గిరాకీ ఏర్పడింది. మనదేశ మార్కెట్‌కు చైనా వస్తువులు రావడం సులభం కావడంతో మన మార్కెట్‌పై చైనా వస్తువుల ప్రభావం పడింది. చైనా వస్తువులు నాణ్యతతో ఉంటాయని, అక్కడ ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందని, చైనా తన వస్తువులను ప్రపంచ దేశాలపై గుమ్మరిస్తోందనే ప్రచారం కూడా ఎక్కువగా జరిగింది. చైనా వస్తువులన్నీ భారతదేశ మార్కెట్‌లోకి వచ్చేశాయని, వస్తువుల రేట్లు తగ్గిపోయాయనే నమ్మకం ప్రజల్లో బాగా బలపడింది. వాస్తవానికి బొంబాయి, కలకత్తా, ఢిల్లీ లాంటి మహానగరాల్లో ఉన్న చైనాబజార్లలో నిజంగానే చైనావస్తువుల మార్కెటింగ్ జరుగుతోంది. ఈ పేరుమీద కొంతమంది వ్యాపారులు సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దీనిలో భాగమే దేశవ్యాప్తంగా చిన్న నగరాల్లో వెలిసిన టెంట్ బజార్లకు, తాత్కాలిక బజార్లకు "చైనా బజార్" అనే పేరు పెడుతున్నారు. ఈ పేరుతో ఒక బజారు పెట్టడానికి పెద్ద ఖర్చేమీ ఉండదు. ఒక చెక్క బోర్డు, లేదా ఒక గుడ్డ బ్యానర్ చాలు. అంతెందుకు ఐదారు సంవత్సరాల క్రితం రైసుమిల్లుల మధ్య సాగిన అనారోగ్యకర పోటీలో 'చైనా నుంచి చైనా బియ్యం వచ్చేస్తున్నాయి' అనే ప్రచారమొకటి సాగిందంటే ఈ పేరుకి ఎంతటి వ్యాపార క్రేజ్ వుందో అర్థమవుతుంది.

చైనా నుండి వచ్చిన వస్తువులను ఒకదానిని ప్రాతిపదికగా తీసుకున్న వ్యాపారస్తులు అవే తరహా వస్తువులను ఇక్కడ తయారు చేసి చైనా పేరుతో అమ్మడం కూడా మొదలుపెట్టారు. నగరంలో ఉన్న చైనాబజార్లలో ఎక్కడకు వెళ్లినా సరే చైనాలో తయారైన వస్తువు ఒక్కటీ కానరాదు. అన్నీ లోకల్ తయారీ వస్తువులే ఉంటాయి. అసలు ఆ స్థాయిలో కూడా ఉండవు. వస్తువులు మాత్రం చైనా వస్తువుల నమూనాను పోలి ఉంటాయి. రేట్లు మాత్రం తక్కువగా ఉంటాయి. అత్యంత ఖరీదైన వస్తువులను కొనలేని వారు వాటి నమూనాలో ఉండే వస్తువుల కొనుగోలుపై ఎక్కువ శ్రద్ధ చూపించడంతో వీటి వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.

ఒక్కసారి చైనా బజార్లోకి వెళితే అక్కడ లేని వస్తువంటూ ఉండదు. చెప్పులు దగ్గర నుండి సెల్‌ఫోన్ల వరకూ అన్ని వస్తువులూ ఉంటాయి. డబ్బుపెట్టలేనివారు అధునాతన వస్తువులు కావాలనుకునే వారు ఈ బజార్లలో వస్తువులు కొంటుంటారు. ఇక్కడ కొన్న వస్తువుల్లో ఒక్కదానికీ గ్యారంటీ అంటూ ఏమీ ఉండదు. పైగా చైనా వస్తువులు కదా అని చెబుతుంటారు. ఇవి మధ్యతరగతి కుటుంబాలను



ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి. వీటిల్లో అన్ని రకాల వస్తువులు దొరుకుతుండటం, మార్కెట్లో పదేపదే తిరగాల్సిన అవసరం లేకపోవడం కూడా చైనాబజార్ల వ్యాపారం ఊపందుకోవడానికి కారణం. కొన్ని మార్కెట్లలో అయితే ఒకడుగు ముందుకేసి స్టీల్ పాత్రలనూ అమ్ముతున్నారు.

చైనాబజార్లలో దొరికే వస్తువుల వివరాలను మాత్రం సంబంధిత వ్యాపారులు బయటకు చెప్పరు. ఏదైనా అడిగితే మాత్రం చైనా అనే సమాధానమే వినిపిస్తుంది. అయితే వీటిపై ప్రజలకు అనుమానం రాకపోవడానికి కూడా ఒక కారణం ఉంది. ఈ చైనా బజార్లను ఏర్పాటు చేసేవారు ఎక్కువగా ఉత్తర భారతదేశానికి చెందినవారు కావడంతో వారికి తెలుగురాదు. కొన్ని వస్తువులకు మాత్రం రేట్లు ప్రకారం తీసుకోవడమే వారు చేసే పని. వినియోగదారులు కూడా వస్తువుల వివరాలు తెలుసుకోకుండా వాటిని కొనేందుకే ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తుంటారు.

ఈ బజార్లలో మరో ప్రత్యేకత ఏమిటంటే అంతవరకూ మార్కెట్‌లో చూడని వస్తువులు కొన్ని ఈ చైనాబజార్‌లో దొరుకుతుంటాయి. చూడటానికి అత్యంత అధునాతనంగా ఉంటాయి. అన్ని రకాల వస్తువులూ చూడటానికి కళ్లు జిగేల్‌మనే రీతిలో ఉండటం కూడా ఈ మార్కెట్లపై క్రేజ్ ఏర్పడటానికి కారణంగా ఉంది.

హైదరాబాద్ నగరంలో ఈ మార్కెట్లు సుల్తాన్‌బజార్, అబిడ్స్, నారాయణగూడ, మెహిదీపట్నం, అమీర్‌పేటల్లో ఎక్కువగా ఉన్నాయి. సికింద్రాబాద్ ఎస్‌డి రోడ్‌లో ఉన్న బజార్‌లో అయితే ఏకంగా సెల్‌ఫోన్లే అమ్ముతుంటారు. ఇక్కడ ఉన్న బజార్ సెల్‌ఫోన్లకే ప్రత్యేకంగా ఏర్పాటు చేశారేమో అన్నట్లు ఉంటుంది. ఇక్కడ చైనా వస్తువులే కాదు, సింగపూర్ వస్తువులు కూడా దొరుకుతుంటాయి.

మరికొన్నిచోట్ల మహిళలను ఆకర్షించడానికే అన్నట్లు వంటపాత్రలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. అంటే వంటపాత్రలు కూడా చైనా బజార్లోనే దొరుకుతున్నాయని కూడా వీటి పట్ల మహిళల్లో ఎక్కువ క్రేజ్ ఏర్పడటానికి కారణం. కేవలం పాత్రలే కాదు బట్టలు, చిన్న పిల్లల ఆటవస్తువులు, గాజుపాత్రలు అన్ని రకాల వస్తువులూ వీటిల్లో లభ్యమవుతున్నాయి.

ఈ వ్యాపారులు స్టాకును కొల్‌కతా, ముంబాయి వంటి నగరాల నుండి తీసుకు వస్తారు. అంటే మన దేశంలో తయారయిన వస్తువు లనే టోకుగా తీసుకువచ్చి ఇక్కడ అమ్ముతుంటారు. నిర్ణీత కాలం తరువాత రిటైల్ షాపుల నుంచి తిరిగొచ్చిన స్టాకులను ఫ్యాక్టరీలు పెద్ద ఎత్తున వేలంపాట పెడతాయి. వాటిని ఒకేసారి కొనుగోలు చేయడంతో తక్కువ ధరకు ఈ వ్యాపారులకు లభ్యమవుతాయి. వాటికి తమ ధరల లేబుల్ వేసుకుని ఈ మార్కెట్లో, ఈ బజార్లలో, ఈ సేల్ ధమాకాల్లో ఆకర్షణీయంగా అమ్మకాలకు పెడతారు. వీటిపై ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు రాత్రికి రాత్రే దుకాణాలను ఏర్పాటు చేస్తుంటారు. అకర్షణీయమైన రీతిలో బోర్డులు ఏర్పాటు చేస్తారు. ఇవి కూడా చైనాబజార్లపై క్రేజీ ఏర్పడటానికి మరో ప్రధాన కారణం.

ఈ మధ్యకాలంలో ఈ వ్యాపారం పట్ల ఉన్నత వర్గాలవారూ మోజు పెంచుకున్నారు. గుంటూరు, విజయవాడ వంటి నగరాల్లో విదేశీ వస్తువుల పేరిట దుకాణాలనే ఏర్పాటు చేశారు. వీరిలో కొంతమంది ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలూ ఉన్నారు. విదేశీ వస్తువులపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని వీరూ సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న మాట. వాటిల్లోనన్నా నిజమైన వస్తువులను అమ్ముతున్నారా అంటే అదీ లేదు. అవికూడా లోకల్‌మేడ్‌వే.

ప్రజలు ఈ చైనాబజార్లలో వస్తువుల పట్ల ఆకర్షితులయ్యేందుకు మరో ముఖ్యకారణం పెద్ద పెద్ద మార్కెట్లలో పెట్టి అమ్ముతున్న వస్తువుల్లోనూ సరైన నాణ్యత లేకపోవడమే. అద్దాల్లో పెట్టి అత్యంత ఖరీదైనవిగా ప్రచారం చేస్తూ అంటగట్టే వస్తువులకు, చైనా బజార్లలో అమ్మే వస్తువులకు కూడా ఎటువంటి తేడా వెంటనే కనబడకపోవటం, కొన్న వస్తువులకు సైతం గ్యారంటీ ఇవ్వలేకపోవడం మరోకారణం. మరోపక్క చైనాబజార్లలో అమ్మే వస్తువులు అవే తరహాలో సగానికి సగం తక్కువ రేట్లకు అమ్ముతుండటం, జాగ్రత్తగా వాడుకుంటే ఎక్కువ కాలం మన్నిక వచ్చే విధంగా ఉండటం కూడా వీటి పట్ల మోజు కలిగేందుకు ఒక ముఖ్య కారణంగా ఉంది.



ఏదైనా వస్తువే కదా...!

'ఏదేనా వస్తువేకదా... ఇక్కడ వస్తువును చూడండి, ఇంకో చోట ఎక్కడైనా గ్యారంటీ పేరుతో అమ్మే వస్తువులను చూడండి తేడా ఏముంటుంది. ఏమీ ఉండదు. అక్కడ రేట్లు ఎక్కువ... ఇక్కడ రేట్లు తక్కువ'. నాణ్యత అంటే మాత్రం రోజురోజుకూ పరిస్థితులు మారిపోతున్నాయి. మనుషులకే గ్యారంటీ లేదు. వస్తువులకు గ్యారంటీ ఎందుకు?' అని ఓ గృహిణి అంటోంది. 'మేము మొన్న 400 వందల రూపాయలు పెట్టి షోకేస్ లైటు కొంటే మా బాబు కిందపడేశాడు. పగిలిపోయింది. అదే 150 రూపాయలు పెట్టి ఇక్కడ కొనివుంటే అది పగిలినా అంత బాధపడేదాన్ని కాదుకదా ! షో కేస్‌లో పెట్టే లైటే కాబట్టి ఎవరూ దాని గురించి పట్టించుకోరు. ఇది గ్యారంటీ ఉందా అని ఎవ్వరూ అడగరు. అయినా అందంగానూ ఉంటుంది. అందుకనే చైనాబజార్‌కు వచ్చాము' అని ఆ గృహిణి తెలిపారు. ఓ పాష్ ఏసి షోరూంలో కొన్న షర్ట్ ఖరీదు రెండువేలుంది. అది వేసుకుని తీరాల నుకున్న కుర్రాడు ఇంట్లో వాళ్ళను పోరి కొనుక్కున్నాడు. తీరా అది కొద్దిరోజులకు ఆటో సీటుపక్కనున్న మేకు పట్టుకుని చిరిగి పోయింది. చాలా బాధ పడ్డాడు. సరిగ్గా అలానే ఉన్న షర్టు ఇలాంటి చైనా బజారుల్లో చవగ్గా కొనుక్కుని ఉంటే ఇలా చిరిగినా బాధపడేవాణ్ణి కాదు అనంటున్నాడు ఓ స్టూడెంటు.

ఒక వస్తువు ఉత్పత్తి అయ్యే దగ్గర నుండి దాని అసలు వినియోగదారుని చేతికి వచ్చేప్పటికి వస్తువుల రేట్లు అనేక చోట్ల పెరుగుతుంటాయి. ఉత్పత్తి తరువాత హోల్‌సేల్, అక్కడ నుండి మధ్యంతర హోల్‌సేల్, స్థానిక హోల్‌సేల్, రిటైల్ ఇలా అనేకమంది చేతులుమారుతూ వస్తుంది. ఈ క్రమంలో వస్తువు ధర అనేక రెట్లు అధికంగా పెరుగుతుంది. ఈ పద్ధతి ఉన్నంతకాలం చైనాబజార్ లాంటి మార్కెట్‌వ్యవస్థ ఉంటూనే ఉంటుంది. ఈ మార్కెటింగ్ విధానంలో వ్యాపారుల శృతిమించిన ఆగడాలు, మోసాల పట్ల బాధ్యత గల ప్రభుత్వ వ్యవస్థలు అదుపును, నియంత్రణను కలిగివుండాలి. అంతకు మించి ఏమీ కోరుకోలేం. ఎందుకంటే ఇప్పటికిప్పుడు వీటిని తొలగించాలి అనలేం కదా. ఎందుకంటే వున్నంతలో ఇవి మధ్యతరగతి వూహా సౌధాల ముంగిట పందిళ్ళు కదామరి !!!

(చాగంటి సోమయాజులుగారు కథకులుగా "చా.సో" అని ప్రఖ్యాతి. చాసో స్మరణగా ఈ కథ ప్రచురిస్తున్నాం)

'ఎందుకు పారేస్తాను నాన్నా...'

చాసో

చెల్లిని వొళ్లో కూచోపెట్టుకుని కృష్ణుడు వంటింట్లో కబుర్లు చెప్తుతున్నాడు. వాళ్ళనాన్న పిలిచి చుట్టలు తెమ్మని డబ్బులిచ్చేడు. కృష్ణుడు వీధిముఖం చూడకుండా, మొగుడు చచ్చిన విధవలాగ ఇంట్లోదూరి కూచుంటున్నాడు. నాన్న చుట్టలు తెమ్మని పురమాయించేడు. హైస్కూలుదాటి చుట్టల దుకాణానికెళ్లాలి. మేష్టర్లు, తోటి విద్యార్థులు అక్కడుంటారు. కృష్ణుడికి రోడ్డెక్కటమే నామోషీగా ఉంది. బడిపక్క నుంచి ఎలాగ వెళ్ళడమని గింజుకుంటూ బయలుదేరేడు.

ఉదయం ఎనిమిది గంటలు కావొస్తున్నది. బడిపెట్టే వేళ. వీధి చివరనుంచే బడిగోల సముద్రపు ఘోషలాగ వినబడుతున్నాది. బడిపక్క నుంచి వెళ్ళక తప్పదు: రాక తప్పదు.

బడి కనబడగానే కృష్ణుడికి బెంగపట్టుకుంది. హైస్కూలు పిల్లల గందరగోళంతో కలకల్లాడుతున్నది. వరండాలు, గదులు, చుట్టూరోడ్లూ, విద్యార్థులతో, విద్యార్థినులతో చూడ సొంపుగాఉంది. రోడ్డువారగా కృష్ణుడు తలొంచుకుని పరిగెట్టాడు.

''కృష్ణా'' అని న్కూలు వరండాలోంచి కేకొచ్చింది. కృష్ణుడు తిరిగి చూడకతప్పింది కాదు. నరశింహం పరిగెట్టుకొచ్చి వాడి భుజంమీద చెయ్యేసి...

"ఏంరా నువ్వు బళ్ళోకి రావడం లేదు" అనడిగేడు.

"సోమవారం చేరుతాను" అని కృష్ణుడు చెప్పేడు.

"పుస్తకాలు కొన్నావా?"

"ఇంకా లేదు."

"వేగిరం కొనుక్కో మళ్ళా అయిపోతాయి. ఎక్సరుసైజు పుస్తకాల షాపుల్లో కొనకేం... స్టోర్సులో చవగ్గా వున్నాయి. ధరలన్నీ దారుణంగా పెరిగిపోయాయిరా!"

నరశింహం డబుల్‌కప్పు చొక్కా హనావా పేంటూ, జోళ్ళూ తొడుక్కుని నీటుగా ఉన్నాడు. కృష్ణుడికి ఉన్న బట్టలన్నీ రెండు నిక్కర్లు, రెండు చొక్కాలు ఉన్నాయంటే ఉన్నాయి. ఒక నిక్కరుకి పోస్టాఫీసుంది. ఒక చొక్కా భుజం చిరిగి జారిపోతే, వాళ్ళమ్మ ఎత్తికుట్టింది. చెయ్యి బుట్టలాగ లేచిపోయింది. రేవుకో జత. కృష్ణుడు పేంట్లు కుట్టించమని ఎప్పుడూ ఏడవలేదు. పేంటుకైతే బట్ట ఎక్కువ పడుతుంది. బట్ట ఎక్కువైతే డబ్బు ఎక్కువవుతుందని వాడికి తెలుసు. మరి రెండుజతలు కుట్టించమని బతిమాలుకున్నాడు. కాళ్లావేళ్లాపడ్డాడు. ఏడ్చుకొన్నాడు. ప్రయోజనం లేకపోయింది.

నరశింహం చంకలో కృష్ణుడికి కొత్తపుస్తకం కనబడ్డాది.

"ఏం పుస్తకంరా అదీ!" అనడిగేడు.

"ఇంగ్లీషు పుస్తకం. నేనన్ని పుస్తకాలూ కొనేశాను. జాగ్రఫీ పుస్తకమే కొనలేదు. జాగ్రఫీ పుస్తకాలింకా స్టోర్సువాళ్ళకి రాలేదు. చూడు పుస్తకం అని ఇచ్చేడు.

కృష్ణుడు పేజీలు తిరగేశాడు. కొత్త పుస్తకంలోంచి ఒక విధమైన పరిమళం పైకి వచ్చింది. కృష్ణుడు పుస్తకంలోకి మొహంపెట్టి వాసన చూశాడు.

"కొత్తపుస్తకం వాసన బాగుంటుంది కదరా!" అన్నాడు నరశింహం

"కమ్మగా ఉంటుంది. నాకెంతో యిష్టం" అన్నాడు కృష్ణుడు.

"నీ కింగ్లీషులో ఫస్టుమార్కురాలేదు, కదరా?"

"నాలుగు మార్కుల్లో పోయింది."

"ఎవరి కొచ్చిందిరా?"

"శకుంతల కొట్టేసింది."

"నిజమే: నేన్నమ్మలేదు: దాని కెన్నొచ్చాయి:"

"నాకరవై నాలుగు, దానికరవై ఎనిమిది,"

"ఆడపిల్లని మేష్టరు వేసేసుంటాడు"

"నీ మొహం: అది తెలివైంది."

"తస్సాచెక్కా! ఆడపిల్లలు చదివేస్తున్నారురా!"

కృష్ణుడు మార్కుల గొడవ తేగానే గొప్పవాడయిపోయాడు. తెలివైనవాడు కాబట్టే నలుగురూ గౌరవిస్తున్నారు. లేకపోతే వాడి కుళ్ళు గుడ్డలని చూసి అంతా దూరంగా ఉండేవాళ్ళే. వాడికి బడిపక్కని నిలబడడం, బడికెళుతున్న నరిశింహాన్ని చూడడం చాలా కష్టంగా ఉంది. ఎంచేతంటే కృష్ణుడు బడికెళ్ళి చదువుకొనే అవకాశాలు తప్పిపోయాయి. వాళ్ళ నాన్న ఈ యేడాది కృష్ణుడికి చదువు చెప్పించనని నిశ్చయంగా చెప్పేశాడు.

"ఎక్కడేనా చదువు మాన్పించుతారండి... ఋణమో పణమో చేసి ముక్క చెప్పించకపోతే కుర్రాడెందుకేనా పనికొస్తాడా: చదువుకునే ఈడులో బడి మానిపించి, ఇంట్లో కూచోబెడితే తరవాత గాడిదలని కాయడానికేనా పనికిరాకుండా పోతాడు. ఏదో చూసి బడిలో వెయ్యండి'' అని వాళ్ళమ్మ శతపోరి చెప్పుకొస్తున్నాది.

"బళ్లో వెయ్యగానే సంబరమా" వాడు చదివేది ఫోర్తుఫారమ్. జీతమెక్కువ. నెల నెలా ఎంత కట్టాలో తెలుసా? తూగ్గలనా? ప్రవేశ పెట్టడానికి, పుస్తకాలకే ఔతుంది ఏభై రూపాయలు. దస్తాకాగితాలు రూపాయి, అర్ధణా పెనసలు ఆరణాలు? ఎక్కణ్ణుంచి తేవడం? మొహాన్ని వాడికి లేందే: వాడి ప్రారబ్ధం. మన ప్రారబ్ధం: వారంవారం ఎక్కడలేని డబ్బు బియ్యానికి ముడుపు చెల్లించడానికే తలప్రాణం తోక్కొస్తున్నాది. మాటలా?" అని వాళ్ల నాన్న చెప్పుకొస్తున్నాడు. తల్లి మాటే నెగ్గుతుందో, తండ్రిమాటే నెగ్గుతుందో ఇంకా తేలలేదు. కృష్ణుడికి మాత్రం సందిగ్ధంలేదు. వాడు తల్లిదండ్రులని బాగా ఎరుగు, తల్లి ప్రతీ విషయంలోనూ బడబడలాడడమేకాని ఆఖరికి తండ్రి చెప్పినట్టే జరుగుతూ ఉంటుంది. అంచేత చదువుకి స్వస్తి చెప్పడమే ఖాయమని నిర్ధారణ చేసుకొని నామర్దతో కృష్ణుడు కుళ్ళిపోతున్నాడు.

కృష్ణుడికి కొత్త ఇంగ్లీషు పుస్తకం పేజీలు తిరగేసినకొద్దీ గుండెల్లో గాభరా పుట్టింది. చదువుతున్న కుర్రాళ్ళమీద ఈర్ష్యా, తనకి చదువులేకుండా పోయిందన్న దుఃఖము- రెండూ రెండు లేడిక పాములై అతని బుర్రని కరకర లాడిస్తున్నాయి.

"కృష్ణా, వేగం చేరరా! డివిజన్లు పెట్టేశారు. నేను 'జే' డివిజనులో పడ్డాను. మన బేచివాళ్లంతా 'జే' డివిజనులోనే పడ్డారు" అన్నాడు నరశింహం.

"అమ్మ బాబో! 'జే' డివిజనుదాకా పిల్లలున్నారా!" అని ఆశ్చర్యపడ్డాడు కృష్ణుడు.

" 'జే' తో ఐపోలేదు. 'కే' డివిజను కూడా ఉన్నాది."

ఏ, బి, సి, డి, అని లెక్కబెట్టి- "పదకొండు డివిజన్లే" అన్నాడు కృష్ణుడు. ఒక్క ఫోర్తుఫారములో సుమారు ఐదు వందలమంది విద్యార్థులున్నారు. కృష్ణుడు అక్కడ నిలబడలేక పుస్తకాన్నిచ్చేసి "నేను చుట్టలకెళ్లాలి. పోతా" నన్నాడు.

''ఈ బొమ్మ చూశావట్రా?'' అని నరశింహం పాఠాలకి ముందున్న త్రివర్ణ చిత్రం తీసి చూపించేడు.

రైతులు జొన్నచేలు కోస్తున్నారు. జొన్న

రేకులని కూడదీసి కట్టుకొన్న పిట్టగూడు గుడ్లతోటే జారిపోతున్నాది. చేలమీద రెండుపిట్టలు ముక్కులువిప్పి ఎగురుతున్నాయి. కోతలవాళ్లు తలలెత్తి పిట్టలని చూస్తున్నారు. అదీ త్రివర్ణచిత్రం.

హైస్కూలు మొదటిబెల్లు ఖంగుఖంగుమంటూ దూరంగా ఉన్న పిల్లలందరినీ పిలుస్తున్నాది. రోడ్డు, వరండాలు, గదులూ విద్యార్థులతో, విద్యార్థినులతో, ఉపాధ్యాయులతో కలకల్లాడుతున్నాయి.

పుస్తకాలు పట్టుకుని సరస్వతీ దేవిలాగు శకుంతల వొచ్చింది. ఆమె చిన్నపిల్ల, పదకొండేళ్లది. సూదిముక్కు, సూదిగెడ్డాం, ఆ రెంటికీ పొందికయిన నోరు కలిగి ముద్దొస్తూ ఉంటుంది. తెలివితేటల తళుకుతో దాని కళ్లు చాంచల్యాన్ని పొందుతున్నాయి.

"కృష్ణా! ఇంగ్లీషులో ఫస్టుమార్కు నాది!" అని వొస్తూనే ఉడికించింది.

''ఒక్క ఇంగ్లీషులోనే కదా! నాకు మూడింట్లో ఫస్టుమార్కులొచ్చాయి. లెక్కల్లో నూటికి నూరు" అన్నాడు కృష్ణుడు.

"ఇంగ్లీషు ముఖ్యమైందండీ" అన్నాది శకుంతల.

"లెక్కలంతకన్నానండి. ఆ మాటకొస్తే తెనుగు ముఖ్యమండి. తెనుగులో ఫస్టుమార్కెవరిదండి?"

''ఇంగ్లీషే ముఖ్యమండి. ఎవరి నడుగుతావో అడుగు."

"తెనుగేనండి. బియ్యే వాళ్లక్కూడా ఇంగ్లీషులో మానేసి లెక్కలూ అవీ తెనుగులోనే చెప్పాలని పేపర్లో పడ్డాదండి"

"నువ్వు మహా పేపరు చదివి ఏడిశావు!"

"నే నాంధ్రపత్రిక రోజూ చదువుతాను. మాయింటి దగ్గరవాళ్ళకొస్తుంది."

రెండోబెల్లు ఖంగుఖంగుమని ప్రారంభమైంది. నరశింహానికి శకుంతల మొహం చూడ్డానికి లజ్జవేసింది. వాడు చదువూ సంధ్యారాని దద్దమ్మ. వాళ్ళతోపాటు సంభాషించడానికి తాహతు లేక తల వాల్చుకుని మౌనవ్రతం పట్టేడు. తన హనావా పంట్లాము ధగధగ లాడుతున్నా, కృష్ణుడి కుళ్ళు నిక్కరు కనబడుతున్నా వాడికి తక్కువతనం లాడుతున్నా రెండోబెల్లు కాగానే చల్లగా బడిలోకి జారిపోయాడు.

''బెల్లయింది, బళ్ళోకి రా!'' అన్నాది శకుంతల.

"నేను సోమవారం నుంచి వస్తాను" అన్నాడు.

"ఫోర్తుఫారంలో నీపని చెపుతాను... ఒక్క ఫస్టుమార్కు రానివ్వను."

"ఇహనన్ని ఫస్టుమార్కులూ నీవేలే!"

"ఏం?"

"ఏమీ లేదు."

''నువ్వు మాయింటికి రావడం మానేశావేంరా? మా అమ్మా, నాన్నా 'కృష్ణుడు రాలేదేమా' అని రోజూ అంటారు."

"ఏమీలేదు."

"నేను బళ్లోకి పోవాలి బాబూ" అని పరిగెట్టింది. "శకుంతలా?" అని పిలిచాడు.

"ఏం!" అని ఆగింది.

ఎందుకు పిలిచాడు? ఆమెకో నిజం చెప్పేసి దుఃఖోపశమనం చేసుకుందుకా. ఎందుకు పిలిచాడో వాడికే తెలియలేదు.

"ఏమీలేదు" అన్నాడు.

శకుంతల వెళ్లిపోయింది. ఇద్దరూ ఒక్క ఈడువాళ్లు. క్లాసుకి వాళ్ళిద్దరే అందరికన్నా తెలివైనవాళ్లు. ఒకరి నోట్సు ఒకరు పుచ్చుకుంటూ స్నేహంగా వుండేవాళ్లు. పంతంతో చదివేవాళ్లు. శకుంతలతో పోటీ కృష్ణుడికి వికాసవంతంగా ఉండేది. శకుంతల దస్తూరీ కృష్ణుడికి జ్ఞాపక మొచ్చింది. ఆమె దస్తూరీ మంచిదికాదు. కొక్కిబిక్కిరిగా రాస్తుంది. అతనిది ముత్యాలకోవ.

శకుంతల బడిలోకి పరిగెడుతుంటే కృష్ణుడు స్తంభించిపోయి చూస్తూ నిలబడిపోయాడు. పిల్లల గోలంతా క్రమేణా అణిగిపోయింది. వరండాలన్నీ ఖాళీ అయిపోయాయి. మేష్టర్ల మాటలు ఉండుండి వినబడుతున్నాయి. వేలకొద్దీ విద్యార్థులు డెస్కులు మీదవాలి కూచుని పాఠాలు వింటున్నారు. బడి దగ్గరనుంచి కృష్ణుడు కదలలేకపోయాడు. తన చదువుపోయింది కదా అని కుమిలిపోతున్నాడు. స్కూలు వరండాలో కెళ్లాడు.

"నే నిక్కణ్ణుంచి కదలను" అనుకొని స్తంభానికి జేరబడ్డాడు.

''నే నింటికే వెళ్లను'' అని నిశ్చయించుకొన్నాడు.

నాలుగోక్లాసు దగ్గరనుంచి బడిలో తను చదివిన ఐదేళ్ల సంగతులూ ఒక్కొక్కటే జ్ఞప్తికి వొచ్చేయి.

ఐదవక్లాసు చదువుతుండగా ఒక పిల్లడు కృష్ణుడు మీద మేష్టరుతో చాడీలు చెప్పేడు. మేష్టరు నమ్మక అబద్ధాలు చెప్పేడని వాణ్ణి చితకతన్నాడు.

మూడవఫారంలో తెలుగు మాస్టరు "గాంధారపతి" అంటే అర్థం చెప్పమన్నాడు. అంతా నేలచూసి, ఇంటికప్పుచూసి, ధృతరాష్ట్రుడని చెప్పేరు. తనొక్కడే "గాంధార దేశపు రాజు" అని చెప్పేడు.

రెండవఫారం చదువుతుండగా దసరా తరువాత ఒక కుర్రవాడు బడికి రావడం మానేశాడు. వాడి పేరు రోజూపిలిచి మేష్టరు ఆబ్సెంటు వేస్తూ ఉండేవాడు. ఆఖరికి వాడు చదువు మానేశాడని తెలిసింది. ఆవేళ అటెండెన్సు రిజిష్టరులో వాడి పేరు కొట్టేసి. మేస్టరు "డిస్కంటిన్యూడ్" అని రాసి ఆ ఇంగ్లీషు మాటకి అర్థం క్లాసులో చెప్పాడు. ఆనాటి నుండి కృష్ణుడు "డిస్కంటిన్యూ" అన్నమాటకు అర్థం మరచిపోలేదు. ఆ పదం జ్ఞాపకం రాగానే అతనికి దుఃఖం పొర్లుకుంటూ వొచ్చింది. "నే నింటికే వెళ్ళను'' అని పునః నిశ్చయించుకొన్నాడు.

"నేను భోజనానికే వెళ్లను" అనుకొన్నాడు.

అతని మొహం గాలికొట్టిన కొత్త పుట్‌బాలులాగ దఃఖంలో పొంగి కందగడ్డ అయిపోయింది. ముక్కు నీటితో బరువెక్కి దిబ్బడేసి పోయింది. ముక్కు ఎగబీల్చుకొంటూ పొంగుకొస్తున్న దుఃఖానికి ఆనకట్టలుకట్టి దిగమింగుతూ స్తంభానికి జేరబడి పోయాడు. మొదటి పీరీడై పోయింది. కృష్ణుడు కదలలేదు. వాళ్ల నాన్న బజారుకి బయలుదేరేడు. వరండాలో కొడుకుని చూశాడు.

"ఓరి వెధవా! చుట్టలు తెమ్మంటే ఇక్కడ దిగమారేవేం?" అన్నాడు.

"చూడు!" అన్నాడు కృష్ణుడు.

"ఏమిట్రా చూడ్డం?" అన్నాడు తండ్రి.

"పాపం. కనబడదు!"

"ఏమిటిరా నీ శ్రాద్ధం?"

" నా శ్రాద్ధమే!"

"ఏమిటిరా?"

"వాళ్లంతా బడికెళ్లారు!"

అప్పుడు తండ్రికి కొడుకు మొహంలో విచారరేఖలన్నీ కనబడ్డాయి.

"వెర్రి నాగమ్మా. అదిరా," అన్నాడు. కృష్ణుడికి ఆనకట్టలు తెగ్గొట్టుకొని దుఃఖం కొట్టుకొచ్చింది. వెక్కివెక్కి చుట్టుకుపోతూ ఏడుపు మొదలెట్టేడు. కొడుకు బాధంతా తండ్రికి బోధపడ్డాది. కొడుకు బాధంతా తండ్రి పడ్డాడు.

"చదువు మానిపించానని అంత బాధ పడుతున్నావా? బడివరండాలు పట్టుకుని దేవుళ్లాడుతున్నావా నాయనా? పద ఇంటికి!" అన్నాడు.

"నే రాను!" అని భూమి బద్దలైపోయినంత గట్టిగా అరిచేడు.

"ఏం చేస్తావురా?"

"గోడకేసి బుర్ర బద్దలుకొట్టుకొంటాను", అని ఇంకా గట్టిగా అరిచేడు. అంతపనీ చేస్తాడేమోనని వెళ్ళి తండ్రి కౌగిలించుకొన్నాడు. "పద నాయనా ఇంటికి" అన్నాడు.

"బడి నాది" అని గట్టిగా కేకేశాడు.

"నీ దేనురా బాబూ'

"బడిలోకి తీసికెళ్లు మరి"

"తల తాకట్టు పెట్టుకునేనా బళ్లో వేస్తాను. ఇంటికి పద."

"ఇప్పుడే వెయ్యి!"

"డబ్బు చూసి వేస్తాను."

"ఇంటికి వెళ్ళి లేదంటావు"

"అన్ను రా."

"ఐతే పుస్తకాలు ముందు కొను?"

"వెర్రి నాయనా! వాటికి మాత్రం డబ్బొద్దూ!"

"ఒక్క పుస్తకం కొను"

"ఏ పుస్తకం కొనమన్నావు?"

"ఇంగ్లీషు పుస్తకం కొను."

"కొందాం, పద. ఏడవకు నాయినా, నే చచ్చిపోయాను ఏడవకు!" అన్నాడు. తండ్రి చెయ్యిని చంకలో పెట్టుకొని గిలగిల కొట్టుకొని ఏడుస్తూ బడిలో స్టోర్సుకి తోవతీశాడు.

తండ్రి దీర్ఘంగా ఆలోచించాడు. చుట్టలు మానేద్దామనుకొన్నాడు. ఎంత మానుదామనుకొన్నా మానలేక పోతున్నాడు. చుట్టలు మానేస్తే కృష్ణుడి జీతానికీ సరిపోతుంది! ఇంకో విధముగా పాలుపోదు. "ఇందాక చుట్టలకిచ్చిన డబ్బులున్నయా పారేశావా!" అనడిగేడు కొడుకుని.

"వ....ప్ప....ప్పారీలేదు. జేబులో ఉన్నాయి... ఎందుకు పారేస్తాను నాన్నా?" అన్నాడు కృష్ణుడు.

(రచనాకాలం మే, 1944)

షాపింగ్! షాపింగ్!

డా॥ ముదిగంటి సుజాతారెడ్డి

"లల్లీ! చాల అలసిపోయినట్లున్నావు ఏమైంది? అడిగాన్నేను రెండు బ్యాగులతో ఇంట్లో అడుగుపెట్టిన లలితవైపు చూసి.

"షాపింగు! మా బంధువులింట్లో రెండు పెళ్ళిళ్ళు వున్నాయి. చీరలు కొందామని పోయాను" లల్లీ నిలబడలేక సోఫాలో కూలబడింది. "ష్!" అంది

''చాలా అలసిపోయావు పాపం!'' అన్నాన్నేను చిరునవ్వుతో.

"రెండు చీరలు కొంటమంటె మాటలా!" నవ్వింది లలిత

"మళ్ళా చీరలెందుకే! మొన్ననే గదా దసరా, దీపావళి అంటూ రెండు చీరలు కొన్నావు. అంతకు ముందు ఆషాఢం, శ్రావణం తగ్గింపులొస్తున్నాయని చీరలు కొన్నావు!" ఆశ్చర్యపోతూ అడిగాన్నేను.

"ఇప్పుడు పెళ్ళిళ్ళు! కట్టుకోడానికి చీరల్లేవు! ఏం కట్టుకోవాలి చెప్పు! "చిన్నబోతూ అంది లలిత.

"అదేందే! ఆషాఢం... శ్రావణం రిబేట్లు సేల్‌లో కొన్నావు, పుట్టింరోజు అని ఓ చీర కొన్నావు. మీ వారి పుట్టింరోజుకో చీర తెచ్చాడు మీ ఆయన. రాఖీ పౌర్ణమికి మీ అన్న ఓ చీర కొనిచ్చాడు. ఇన్ని చీరలుండగా పెండ్లికి కట్టుకోవడానికి చీరే లేదంటావేమిటే!'' అన్నాన్నేను తెరిచిన నోరుమూసుకోలేని ఆశ్చర్యంతో.

'' అబ్బ! నీకు లెక్కలన్నీ బాగా గుర్తుంటాయే! కాని ఆ చీరలన్నీ ఇంతకుముందే కట్టేశాను. అందరూ ఆ చీరలు చూసినవే. మళ్ళా పెళ్ళిలో ఆ చీరలను కట్టుకుంటే అందరూ ఏమనుకుంటారే చెప్పు! అంతేకాదు... అందరేమనుకుంటారో ఆ మాట వదిలిపెట్టు. నా మట్టుకు నాకు మాత్రం కట్టిన చీరనే కడ్తే ఆత్మగౌరవం ఏం వుంటుంది చెప్పు! గుర్తింపు ఏం వుంటుంది! ఏం ఆత్మవిశ్వాసం కలుగుతుంది చెప్పు! అదీ పెళ్ళిలో! అందరూ నావైపే, నా చీర వైపే, చూసి... పాపం! ఈమెకు చీరలే లేవు... మళ్ళా అదే చీర కట్టుకుంది! అని చూసినట్లుగా అనిపించి నాకెంత అవమానంగా వుంటుందో ఊహించు సుశ్శీ!..." అంది లలిత మళ్ళా చిన్నబోతూ.

నేను నవ్వాను. లలిత పరిస్థితిని ఆడదాన్నయిన నేను అర్థం చేసుకోగలను. కాని వాళ్ళాయన అర్థం చేసుకున్నాడా అని నాకు అనుమానం వచ్చింది. "లల్లీ! మరి మీ ఆయన డబ్బు..." అని నేను పూర్తి చేయకముందే లలిత అందుకుంది.

"ఈ కాలంలో వెంటనే డబ్బు కట్టి చీరలు కొనాలని లేదు. వాయిదాల పద్ధతి మీద బోలెడు మంది చీరలమ్ముతున్నారు. చీరల వ్యాపారం ఓ గృహపరిశ్రమగా వుందనుకో. చూడు ఈ రెండు చీరలు రెండు పెళ్ళిళ్ళకని వాయిదాల మీదనే కొన్నాను." అని లలిత ప్లాస్టిక్ బ్యాగుల్లోంచి రెండు చీరలు తీసి చూపించింది. చీరలు బాగున్నాయి. జిగేల్‌మనే చమ్కీలతో మెరిసిపోతున్నాయి.

''చాలా ధరనేమోనే'' అన్నాన్నేను అనుమానంగా. "చాల ధర ఏం లేదే... రెండు వేలకో చీర. వచ్చిన చిక్కేమిటంటే చీరలు చినగనే చినగవు. పూర్వమైతే చీరలు చినిగి జీర్ణమైతేనే మరో కొత్త చీర కొనుక్కునేవాళ్ళు. ఇప్పుడు చీరలు చినగడమన్న ప్రశ్నే లేదు!" అంది లలిత విజయగర్వంతో.

"బోలెడు చీరలున్న తరువాత చీరలు చినగడమన్న ప్రశ్న ఎక్కడ వస్తుందే! కట్టిన చీరను మళ్ళా కట్టవైతివి!" చిలిపిగా లల్లివైపు చూశాను.

"అబ్బ! నా చీరల గురించి నీకూ నవ్వులాటగానే వుంది. చీరల విషయంలో నువ్వు మా తోడికోడల్ని చూస్తే నన్ను పాపం లల్లీ! అంటావు. ఆమె రోజుకొక్క చీరైనా కొనకుండా ఉండలేదనుకో! అదే విధంగా రోజుకో చీర కడ్తుంది. ఒక్కసారి కట్టిన చీరను మళ్ళా ఎప్పుడో గాని రిపీట్ చెయ్యదు. నువ్వు టీవీ సీరియళ్ళలో గమనిస్తావో లేదో! ప్రతి ఆడపాత్ర ఒక్కొక్క సీనులో ఒక్కొక్క చీర కడ్తుంది. ఆ చీరలను గమనించటమే ఆమె పని. వెంటనే పోయి అట్లాంటి చీర కొనుక్కోంది ఆమెకు నిద్ర పట్టదు పాపం! అందులో నేను చెప్పాను గద - వాయిదాల మీద బోలెడుమంది చీరలమ్ముతున్నారని. అందుకే డబ్బు చేతిలో వుందా అన్న సమస్యే లేదు. వెంటనే పోయి చీర కొనుక్కోవటం కట్టేయటం?"

"అంటే నువ్వనేది టీవీ సీరియళ్ళలో ఏఏ పాత్ర ఏయే చీర కట్టుకున్నదని చూసేవాళ్ళు కూడా వుంటారన్న మాట. కథ, యాక్టింగ్‌లు మాత్రమే చూస్తారనుకుంటున్నాన్నేను!"

"ఎంత అమాయకురాలవే సుశ్శీ! ఏ పాత్ర ఏ రకం బ్లౌజు వేసుకుంటే ఆ డిజైన్లో బ్లౌజు కుట్టించుకునేవాళ్ళు కూడా వున్నారు!" లలిత నన్ను మరింత ఆశ్చర్య పరిచింది ఆ మాటలతో.

"అవును గద! ఇప్పుడు ప్రతి చీరలో మ్యాచింగు బ్లౌజు బట్టను ఇస్తున్నారు. కాబట్టి ఆ బట్టతో బ్లౌజు కుట్టించుకోవాల్సిందే... మరి అటువంటప్పుడు అన్ని బ్లౌజులు ఒక్కలాగే, ఒక్క డిజైన్లో వుంటే ఏం బాగుంటుంది!" అన్నాన్నేను.

"సరేనా... కాస్త కాఫీ ఇస్తావా లేదా! ఊరకనే నన్ను పంపించేస్తావా? నేనింకా బోటిక్‌కు పోయి మా అమ్మాయి వసంతకు డ్రెస్‌లు కావాలి. బోటిక్‌లో అయితే లేటెస్టు ఫ్యాషన్లుంటాయని చెప్పింది వసంత. దానికి నచ్చేటట్లుగా కొనాలి. అందుకే నాలుగు బోటిక్కుల్లో చూసి కొనాలి. లేకపోతే నా ప్రాణాలు తీసేస్తుంది డ్రెస్సులు బాగా లేవని" అంది.

నేను లేచి రంగు కప్పుల్లో కాఫీ చేసి తెచ్చాను. లల్లీకి ఇచ్చి నేనూ కాఫీ కప్పుతో కూర్చున్నాను. నా మనస్సు మాత్రం ఎక్కడికో పరిగెత్తుతున్నది. పత్రికల్లో, టీవీల్లో ఎక్కడ చూసినా బట్టలు, బోటిక్‌ల చీరల దుకాణాల ప్రకటనలే! తగ్గింపు ధరతో సేల్ అని ప్రకటనలు! లేటెస్ట్ డిజైన్లలో డ్రెస్సులని బోటిక్కుల ప్రకటనలు! అబ్బబ్బ! ఈ బట్టల, చీరల, డ్రెస్సుల్లో రకాలు కొత్త డిజైన్లు చూస్తుంటే ఆడవాళ్ళకు మరో ఆలోచనలు కలిగే అవకాశమే లేదు. బట్టల ఆకర్షణలో మునిగిపోని ఆడవాళ్ళెవరుంటారు! అది పోగా బట్టలకు మ్యాచ్ అయ్యే నగల ప్రకటనలు! మనస్సు తిప్పుకోలేని ఆకర్షణలు! ఊపిరి పీల్చుకోవటానిక్కూడా సమయంలేని షాపుల కోలాహలాలు! వెంటనే డబ్బు చెల్లించే అవసరంలేని బ్యాంకు కార్డులు! వాయిదా పద్ధతులు! స్త్రీల ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వం, స్వేచ్ఛ, గుర్తింపులన్నీ ఈ షాపింగుల మీదనే ఆధారపడి వుంటున్నాయి! ఈ చీరల, నగల వస్తు ప్రపంచం స్త్రీని ముంచెత్తుతున్నది! వేరే ఆలోచనలను మరిపిస్తున్నది.

మూగసాక్ష్యం



అమ్మిన శ్రీనివాసరాజు

ఖమ్మం జిల్లా కోర్టు హాలంతా జనంతో కిటకిటలాడుతోంది. న్యాయమూర్తి ఇచ్చే తీర్పు కోసం అక్కడున్న వారంతా ఆతృతతో ఎదురు చూస్తున్నారు. న్యాయమూర్తికి ఇరువైపులా వున్న బోనుల్లో ముద్దాయి రిక్షా రంగడు, ఫిర్యాదిదారు కాంతమ్మ నిలబడి వున్నారు. కాంతమ్మ న్యాయమూర్తికి తన గోడును వినిపిస్తోంది. ఆమె చెప్పేది జాగ్రత్తగా ఆలకిస్తున్నారు న్యాయమూర్తి రామనాధం.

"ఆ రోజు సాయంత్రం బడి నుండి పిల్లలంతా ఇళ్లకు వస్తున్నారు. ఒకపక్క రిక్షా నిండా పిల్లల్ని ఎక్కించుకున్న వీడు ముందూ వెనుకా చూసుకోకుండా వస్తున్నాడు. వాడి రిక్షాకు బెల్లు కూడా లేదు. సరిగ్గా అదే సమయంలో నా గారాలపట్టి బంటి రోడ్డు దాటుతున్నాడు. అప్పుడు మా వాడిని రంగడు రిక్షాతో తాకించాడు. దాంతో వాడి కాలు విరిగిపోయింది. నా కొడుకు కాలు ఎవరిస్తార్రా దేవుడా?!" అంటూ మరోమారు శోకాలు తీసింది కాంతమ్మ.

"ఏమయ్యా రంగా...! ఆవిడ చెప్పింది విన్నావు కదా. ఏమంటావు? తప్పు ఒప్పుకుంటావా?!" అని ప్రశ్నించారు న్యాయమూర్తి.

'నాకేమీ తెలియదు' అన్నట్లు చేతులూపాడు రిక్షా రంగడు. ఎంత అడిగినా చేతులు జోడిస్తున్నాడు తప్ప నోరు విప్పి మాట్లాడటం లేదు.

"ఏమయ్యా... ఎంత అడిగినా మాట్లాడవేంటి? నీకు మాటలు రావా?" అడిగారు న్యాయమూర్తి విసుగ్గా.

'ఔను' అన్నట్లు మళ్లీ తలూపాడు రిక్షా రంగడు.

ఎదురుగా బోనులో నిలబడిన కాంతమ్మకు రిక్షా రంగడు మూగవానిగా నటించడం చూసి ఎక్కడలేని కోపం వచ్చింది. "ఓరి దొంగ వెధవా? ఎంత నాటకం ఆడుతున్నావు? నీకు నిజంగా మాటలు రావా? ఆ రోజు ఇంత గొంతుతో 'తప్పుకోండి... తప్పుకోండి... పిల్లాణ్ణి తియ్యండి' అంటూ కేకలు వేశావుగా. అప్పుడే మర్చిపోయావేంట్రా?" అంటూ పళ్లు పటపట కొరికింది.

వెంటనే రంగడు, "విన్నారా సారూ! ఆవిడే అసలు విషయం చెప్పింది. పక్కనే వున్న ఆమె కొడుకును జాగ్రత్త చేసుకోలేకపోయింది. రిక్షా అదుపు తప్పి పోవడంతో పదిమంది పిల్లలను కాపాడబోయాను. ఆ ప్రయత్నంలోనే ఈమె కొడుకు కాలికి నా రిక్షా వల్ల చిన్న దెబ్బ తగిలింది. దానికి ఇంత పెద్ద కట్టు కట్టించింది. కాలు విరిగిందని, అందుకు నేనే బాధ్యుణ్ణని డబ్బు బలంతో నన్ను కోర్టు కీడ్చింది. న్యాయం మీరే చెప్పండి సారూ..." అని ప్రాధేయపడుతూ అసలు విషయం చెప్పాడు రంగడు.

"ఏమ్మా! ఆ రోజు 'తప్పుకోండి... తప్పుకోండి' అంటూ రంగడు అరిచాడా?" అని మళ్లీ ప్రశ్నించాడు న్యాయమూర్తి. విషయం తెలిసిపోయాక తప్పించుకునే మార్గం లేక ఔనంటూ తలూపింది కాంతమ్మ.

ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత రిక్షా రంగడిది ఏ మాత్రం తప్పు కాదని, కాంతమ్మ అశ్రద్ధ వల్లే ఆమె కొడుకు కాలికి దెబ్బ తగిలిందని న్యాయమూర్తి రామనాధం తీర్పు ఇచ్చారు.

నీతి: ఉపాయంతో అపాయం నుండి బయటపడొచ్చు.



రంగులు పులిమేద్దాం!



హాయ్! ఆ పిడుగులు చూడండి. వాళ్ల నాన్నగారు కారు కడగమంటే... నీళ్లతో ఆడుకుంటున్నారు. పైగా నీళ్లతో ఆడుకోడానికి ఇదే సరైన సమయమని రెచ్చిపోతున్నారు. పైపుతో తడిపేసుకుంటున్నారు. మీకైతే ఇదే మంచి అవకాశం. వాళ్లు అలా నీళ్లతో ఆడుకుంటుండగానే... గబగబా రంగులు తీసుకుని వాళ్లకు పులిమేయండి. ఓకేనా!

❄

వి'చిత్రం'

చిన్నారులూ- ఇవాళ మీ ముందుకు వచ్చిన వి'చిత్రం' చూశారుగా. దీన్ని ఓ ఆర్టిస్టు అంకుల్ వేశారు. ఇందులో వున్న ప్రత్యేకత ఏంటంటే... అబ్బా! ఆశ...దోశ...అప్పడం...వడ. చెప్పేస్తామేంటి? మీరే చెప్పాలి.

ఏంటి మీ బుల్లి బుర్రలకు తెగ పదును పెడుతున్నట్టున్నారే! చెప్పండి చెప్పండి. 'ఆ... ఏముందండీ... ఫొటోలోని పిల్లాడు ఏదో పండు పట్టుకున్నాడు. దానికే మీరు ఆశ, దోశ, అప్పడం, వడ అని ఊరించడం ఏం బాలేదు' అంటున్నారు కొందరు నేస్తాలు. కానీ... మేం అంత బిల్డప్ ఇచ్చామంటే... ఏదో వుందని అర్థం చేసుకోవాలి నేస్తాలూ... బొమ్మలో ఆ పిల్లవాడే కాదు. వాళ్ల నాన్న కూడా వున్నాడు. ఏంటి అలా ఆశ్చర్యపోతున్నారు. ఇప్పటికైనా మించి పోయినదేమీ లేదు. మరోసారి చూసి చెప్పండి. ఏంటి కనబడలేదా! అయితే మా జవాబు చూడండి.

జవాబు

పిల్లలూ! ఒక్కసారి పుస్తకం తిరగేసి చూడండి. ఇప్పుడు పిల్లవాడి తండ్రికూడా కనిపిస్తాడు. ఏంటి? అలా పెదవి విరుస్తున్నారు. పిల్లవాడి గడ్డమే తండ్రి ముక్కు. కావాలంటే... తిరగేసిన పుస్తకాన్ని కాస్త దూరంగా పెట్టుకుని చూడండి. ఏంటి కనిపించిందా! అదే మరి ఆర్టిస్టు అంకుల్ గొప్పతనం. చప్పట్లు చరిచి ఆయనను అభినందిద్దామా!

❄

చిన్నారి చిత్రకారులు



జి.వి.ఎస్.ఎస్.శ్రుతి,
1వ తరగతి,
గీతాంజలి హై స్కూల్,
ఆర్‌టిసి క్రాస్ రోడ్స్,
హైదరాబాద్. 20.



బి.దుర్గా ప్రసాద్, 10వ తరగతి,
ఎస్ఆర్ఎస్ఎమ్‌బిహెచ్ స్కూల్, కొత్తపేట, తెనాలి.



కె.చరిత, 5వ తరగతి,
సెయింట్‌పాయిస్ గరల్స్ హైస్కూల్, హైదరాబాదు.




వీరి వీరి గుమ్మడిపండు...
వీరి పేరేమి?

హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినవారెవరో మీకు తెలుసా? ఈ అంకుల్ మంచి హాకీ ఆటగాడు. అబ్బో చాలా మంది నేస్తాలకు తెలిసిపోయినట్టుందే. చేతులు విదిలిస్తున్నారు. ఒకవేళ తెలీక పోతే మీ పెద్దవాళ్లను అడిగి తెలుసుకోండి. అంతటితో మీపని అయిపోలేదు. చక్కగా ఓ కార్డు తీసుకుని ఆ అంకుల్ పేరు రాసి పంపండి. ఒకేనా. ఈ పని ఇవాళే ఇప్పుడే చెయ్యాలి.

మరి మా చిరునామా: **వీరి వీరి గుమ్మడిపండు**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్టేట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాదు.

సరైన సమాధానాలు రాసినవారు

బి.పావని, కె.పల్లవి, వి. వసుంధర, జె. మాధురి, ఎమ్. విమలశ్రీ, బి. బంగారి, 7వ తరగతి, అశోక్‌నగర్, హైదరాబాదు. కె.సుందర్, 8వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. సిహెచ్. చిత్రాంజని, 5వ తరగతి, కాకినాడ. సిహెచ్. గీతాకృష్ణ, 7వ తరగతి, కాకినాడ. సిహెచ్. వల్లభ్, బి. ప్రకాశ్, 10వ తరగతి, గుడివాడ. మల్లెల పాండురంగారావు, 9వ తరగతి, మల్లెల ఫాల్గుణ్, 7వ తరగతి, కాకినాడ. ఎ.సాహిత్య లోహిత, 3వ తరగతి, పాలకొల్లు. బి.లక్ష్మి ప్రియ, 9వ తరగతి, వనపర్తి, మహబూబ్‌నగర్.కె.వాణి, 6వ తరగతి, నెల్లూరు. డి. భార్గవి, ఎమ్. కరుణాకర్, 10వ తరగతి, మారేపల్లి.

గతవారపు జవాబు:
ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

ఎందుకలా?

నేస్తాలూ... బొమ్మలో పిల్లిగారు ఏదో రాస్తున్నారు. ఏంటో చదివి చెప్పండి. ఏంటి? ఆ పిల్లి 'THE CAT' అని రాస్తోందా! మరి అట్లా అయితే... రెండో అక్షరం, ఐదో అక్షరం ఒకటేగా వున్నాయి కదా. అలాంటప్పుడు దాన్ని THE CAT అని ఎలా చదివారు? చెప్పకోండి చూద్దాం.

సమాధానం

నేస్తాలంతా విపరీతంగా ఆలోచిస్తున్నారు. కానీ సమాధానం దొరికినట్టు లేదే. మరి మమ్మల్నే చెప్పమంటారా? మనం ఏదైనా చూసి చదివేటప్పుడు దానికి ఏదైనా అర్థం వుందా లేదా అనేది కూడా చూస్తాం. అందుకే రెండవ అక్షరం H గాను, ఐదవ అక్షరం A గాను చదివేస్తాం. అదన్నమాట సంగతి.

పేపర్ బొమ్మలు చెయ్యడం మీకూ వచ్చా?

ఫ్రెండ్స్! మీకు వారం వారం పేపర్‌తో బొమ్మలు చెయ్యడం నేర్పిస్తున్నాం కదా. ఇలాంటివి చెయ్యడం మీకూ వచ్చేవుంటుంది. కార్డుమీద రాసి పంపిస్తే ఎంచక్కా మీ పేరు, తరగతి, ఊరుతో సహా ప్రచురిస్తాం. మా చిరునామా:

పేపర్ బొమ్మలు, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్టేట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాదు.



గ్రీటింగ్ చేద్దామా!






హేయ్ చిన్నారులూ... సంక్రాంతి పండుగ వస్తోంది కదా. మరి మీ ఫ్రెండ్సందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ గ్రీటింగ్ పంపడం లేదా! పంపిస్తున్నారా? అందుకోసం అమ్మావాళ్లని డబ్బులు కూడా అడుగుతున్నారా? ఎందుకర్రా. డబ్బులు దండగ. ఎంచక్కా తక్కువ ఖర్చుతో చక్కటి గ్రీటింగ్ చెయ్యడం ఎలాగో నేర్పుతాం. మరి చేసేస్తారా? య్యస్ పిల్లలంటే మీలా వుండాలి. మరి ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా మొదలెడదామా.

కావలసిన వస్తువులు: పూలు, ఆకులు, కత్తెర, తెల్లటి చార్టు, గమ్. **ఎలా చెయ్యాలంటే...** ముందు మీరు రకరకాల అందమైన పూలను సేకరించండి. తర్వాత వాటిని ఎంచక్కా ఒక న్యూస్ పేపర్‌లో పెట్టండి. ఆ తర్వాత వాటిమీద లావాటి పుస్తకాలు వుంచండి. రెండు మూడు రోజుల తర్వాత తీసి చూడండి. పూలన్నీ చక్కగా అణిగిపోయి ఎండిపోయి వుంటాయి. వాటిని మెల్లగా తీసిపక్కన పెట్టుకోండి.

తర్వాత గ్రీటింగ్ సైజ్ చార్టు కత్తిరించి దాని మీద పూలను అందంగా అతికించండి. అంతే గ్రీటింగ్ రెడీ. ఇప్పుడు ఈ పూల పైనో, కిందో శుభాకాంక్షలు రాయండి. తర్వాత కవర్‌లో పెట్టి మీ నేస్తాలకు పంపండి. వాళ్లు ఎంతో సంతోషిస్తారు తెలుసా!

స్వయం కృషి

పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ

మధ్యాహ్నం రెండు గంటలైంది.

ఎండవేడి ఇంకా తగ్గలేదు. వేడి గాలులు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

గిరిజన తండాలో వరుసగా అగ్గిపెట్టెల్లాంటి ఇళ్లు.

ఇళ్ల మధ్య దూరం ఉన్నప్పటికీ కనిపించడం లేదు. ఇంటి మధ్యనున్న స్థలంలో చెత్తాచెదారాలు పేరుకుపోయి ఉన్నాయి.

పాడుపడిన పూరిపాకలో మాలోతు మంక్తి కూర్చుని ఉంది. ముందు సత్తుగిన్నె ఉంది. ఆ గిన్నెలో గంజి మెతుకులు ఉన్నాయి. అన్నం తింటూ మిరపకాయ నంజుకుంటోంది.

వయస్సు ముప్పయి సంవత్సరాలు ఉంటుంది.

కష్టపడుతున్న శరీరం... కష్టాలను ఈదుతున్న జీవితం మొహంపైన ముడతలు తీసుకువచ్చాయి. ఆమె వయస్సును మరికొంచెం ఎక్కువచేసి చూపిస్తున్నాయి.

ముగ్గురు ఆడపిల్లలు తండాలో కర్రలకు పోయారు.

చిన్నవాడు మగ పిల్లవాడు తుంగుటుయ్యాలలో పడుకుని ఉన్నాడు. తాటి కొమ్మలతో నేసిన గుడిసెలో మీద నున్న వెదురుకర్రలకు రెండు తాళ్లు వేలాడదీసి పాత చీరను ఉయ్యాలగా తయారుచేసింది. అందులో మంగును పడుకోబెట్టింది.

ఉదయం నుంచి పనితో సరిపోయింది.

తినడానికి కూడా సమయం చిక్కలేదు. ఆకలితో కడుపు నకనకలాడిపోతోంది. పిల్లలకి తిండి పెట్టి బైటికి పంపించింది. మంగును నిద్ర పుచ్చింది. తర్వాత ముందురోజు రాత్రి కుండలో మిగిలిన అన్నాన్ని తెచ్చుకుని కూర్చుంది.

భర్త దుబ్లా పనికిపోయాడు.

ఉదయాన్నే సిల్వరుగిన్నెలో గంజి అన్నం పెట్టుకుని మఠంపల్లి పోతాడు. సాయంత్రం వరకూ క్వారీలో రాళ్లుకొట్టి ఇంటికి వస్తాడు. కూలిగా వచ్చిన నలభై రూపాయలు భార్య చేతిలో పెట్టి అలసిపోయి నిద్రపోతాడు.

సాయంత్రం చీకటి చిక్కబడుతున్న సమయానికి దుబ్లా ప్రతిరోజూ వస్తుంటాడు. ఆ సమయానికి ఎన్ని పనులున్నా కంపలను రాజేసి కుండతో వేడినీళ్లు పెడుతుంది. అలా స్నానం చేస్తే ఒళ్లునొప్పులు తగ్గుతాయని భార్యాభర్తలిద్దరికీ నమ్మకం. స్నానం తర్వాత వండుకున్నదేదో తిని నిద్రపోతారు. మర్నాడు నిద్ర లేచినది మొదలు రోజువారీ కార్యక్రమం మామూలుగా కొనసాగుతుంది.

ముగ్గురు ఆడ పిల్లలు పదేళ్లలోపు వారే. ఆ తర్వాత మగపిల్లవాడు. నలుగురు సంతానంతో ఆ గిరిజన కుటుంబం గిరిజన తండాలో వదిలవైన పొదరిల్లుగా తయారైంది.

మాలోతు మంక్తి అన్నం తినడం పూర్తయింది.

గిన్నెలు గోలెం వద్ద నీటితో శుభ్రం చేసింది.

ఆ సమయంలో దూరం నుంచి అరుపులు వినిపించాయి. మంక్తి ఆశ్చర్యంతో ఆ వైపు చూసింది.

గిరిజన తండాకు చెందిన ఇద్దరు యువకులు పరుగు పరుగున మంక్తి ఇంటివద్దకు వచ్చారు. పరుగులతో రావడంతో వారు రొప్పుతున్నారు.

"ఏందిరా మార్గా! ఏమైంది?" మంక్తి అడిగింది.

ఆమె మాటకు సమాధానం చెప్పకుండా వారు ఏడవడం మొదలుపెట్టారు. "అక్కా! అన్నేయం అయిపోయిందే! " కూలబడిపోయాడు.

మంక్తికి ఏమీ అర్థం కాలేదు. వచ్చినవాళ్లు తన ఇంటి వద్దకు వచ్చి ఎందుకు ఏడుస్తున్నారో తెలియలేదు. ఆమె మనసులో ఏదో మూల చిన్న అలజడి మొదలైంది. గుండెలు అదిరాయి. ఒంటిలో అదోలాంటి వణుకు ప్రారంభమైంది. ఈ హడావుడి చూసి గిరిజన తండాలో గిరిజనులంతా తమ పనులు వదిలిపెట్టి చుట్టూ చేరారు. అందరిలోనూ ఒకటే అయోమయం... ఒకటే ఆతృత.

ఇంతలో అందులో యువకుడు – "దుబ్లా గుండె పోటుతో కుప్పకూలిపోయాడు. క్వారీ పనోళ్లంతా దవాఖానకు తీసుకుపోయింద్రు. గుండాగిపోయిందని డాక్టర్లు సెప్పినారంట..." మెల్లమెల్లగా చెప్పాడు.

ఆ మాటలు మంక్తి గుండెల్లో గునపాల్లా గుచ్చుకున్నాయి. మనసు మొద్దుబారిపోయింది. నోట మాట రాలేదు. ఆ తర్వాత ఒక్కసారి ఉప్పెనలా దుఃఖం కమ్ముకువచ్చింది. ఆమెను ఆపడం ఎవరి తరమూ కాలేదు. గుండెలు అవిసేలా దుఃఖిస్తున్న ఆమెను చూసి గిరిజన తండా నివ్వెరపోయింది. "నా పిల్లల్ని ఎవరు చూస్తారో. నా బతుకు నట్టేట్లో మునిగిందో... నా ఇంటి దీపం ఆరిపోయిందో" అంటూ ఆమె తీస్తున్న శోకాలు అందరి హృదయాలను కలిచివేశాయి.

ఆ తర్వాత సాయంత్రం ఆటోలో దుబ్లా మృతదేహం వచ్చింది.

మాలోతు మంక్తి ప్రమేయం లేకుండానే కార్యక్రమాలన్నీ జరిగిపోయాయి. ఇంటిలో చిల్లిగవ్వలేదు. మర్నాడు వంట చెయ్యడానికి కేజీ బియ్యం కూడా లేవు. భర్తకు వేడినీళ్ల కోసం ఏరుకొచ్చిన కట్టెలు మాత్రం గుడిసె ముందు కుప్పగా ఉన్నాయి.

శూన్యంలోకి చూడటం తప్ప మంక్తిలో చలనం లేదు.

నలుగురు పిల్లలూ బల్లుల్లా తల్లిని కరుచుకుపోయారు.

తోడులేని జీవితం.. భర్త లేని బతుకు ఆమె కళ్లముందు మెదలిన ప్రతిసారీ దుఃఖం తెరలు తెరలుగా కమ్ముకుని వచ్చేది. నలుగురు పిల్లల్ని చూసి ఆ దు:ఖం మరింత ఎక్కువ అయ్యేది.

అమ్మ, నాన్నలు లేరు... అన్నదమ్ములు బంధువర్గం లేరు. భర్త తరఫువారు కూడా ఎవరూ లేరు. ఆదుకొనేందుకు, ఆదరించేందుకు మనుషులే కొరవడ్డారు. చుట్టుపక్కల వారి ఊరడింపుమాటలు మాత్రం కొంతలో కొంత స్వాంతన కలిగించేవి.

* * *

నల్గొండజిల్లా మఠంపల్లి మండలం సుల్తాన్‌పూర్ తండా ప్రశాంతంగా ఉంది.

భర్తను కోల్పోయిన మాలోతు మంక్తి దుఃఖం నుంచి తేరుకుంది.

నలుగురు పిల్లల కుటుంబాన్ని పోషించే భారం మీద పడింది. ఆత్మ విశ్వాసంతో ఎలాగైనా సాధించాలని నిర్ణయించుకుంది. అంత వరకూ తనకు తోడుగా నీడగా ఉన్న దుబ్లా లేని జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో మొదటిసారి తెలుసుకుంది.

మంక్తి పరిస్థితి చూసి గ్రామస్తులంతా జాలిపడ్డారు.

ఆమెను, ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. గిరిజన తండాలో తలో గిరిజన కుటుంబం తాము సంపాదించిన సొమ్ములో కొంత పొదుపు చేయాలని ఆ సొమ్మును మంక్తికి అందజేయాలని అనుకున్నారు.

ఆ విషయం ఆమెతో చెప్పారు.

వారి మాటలు విన్న తర్వాత మొదటిసారి ఒకలాంటి దుఃఖం ఆమెలో కలిగింది. జాలి పడటం ఆమె భరించలేకపోయింది. తనకు ఎవరూ లేరన్న సానుభూతితో అందరూ సహాయం చేయాలని ముందుకు వస్తున్నారని ఆమె భావించింది. అందుకే "ఎటువంటి సాయం అవసరం లేదు! " అని నిర్ద్వంద్వంగా చెప్పింది.

"అయితే ఎలా బతుకుతావు? " పక్క ఇంటిలో వృద్ధురాలు ప్రేమగా ప్రశ్నించింది.

"అవును. ఎలా బతుకుతాను? మంక్తి మనసు ఆమెనే తిరిగి ప్రశ్నించింది. జవాబు దొరకలేదు. ఆ తర్వాత నెమ్మదిగా అంది. "నాకు డబ్బులు అందించే సాయం ఏమీ చేయవద్దు. కష్టపడటానికి వీలు కల్పించ"మని కోరింది.

ఆమె మంచితనం, నిజాయితీ, చిత్తశుద్ధి అందరినీ ఆకట్టుకున్నాయి.

"పాల వ్యాపారం చేయొచ్చుకదా?" ఎవరో సలహా ఇచ్చారు. చాలాసేపు ఆలోచించిన తర్వాత వారిచ్చిన సలహా ఆమెకు ఎంతగానో నచ్చింది. ఆ మాటలకు అనుగుణంగా ఆలోచన కొనసాగించింది. పాల వ్యాపారం చేయడానికి వీలుగా కార్యక్రమాన్ని రూపకల్పన చేసింది.

ముందుగా సుల్తాన్‌పూర్ తండా వారిని సంప్రదించింది.

ఆ తండాలో గేదెలు, ఆవులను ప్రతివారు పెంచుతున్నారు. అందరికీ ఒకటి రెండుకు తక్కువ కాకుండా పశువులు ఉన్నాయి. చాలామంది గిరిజనులు పాల వ్యాపారం చేస్తుంటారు. వీరిలో చాలామంది దూరంగా రహదారి పక్కనున్న టీ కొట్లలో పాలను విక్రయిస్తూ జీవనాన్ని గడుపుతున్నారు.

వారందరితో సంప్రదించి వారి నుంచి పాలు సేకరణ చేపట్టింది. ఒక్కో ఇంటి నుంచి లీటరు పాలు ఇచ్చేవారు. ఈ పాలకు అసలు ధరకే మంక్తికి అందించేవారు. అక్కడ లీటరు పాలు నీళ్ళు కలపకుండా పదకొండు రూపాయలకు అమ్మేవారు. అయితే గ్రామస్తులందరూ తాము సేకరించిన పాలలో లీటరు పది రూపాయలకే మంక్తికి విక్రయించడానికి ముందుకు వచ్చారు. ఆర్థికసాయం చేస్తామని ముందుకు వచ్చినా తిరస్కరించినందున ఆమె పట్ల గ్రామస్తులలో ఒకలాంటి గౌరవం ఏర్పడిపోయింది. కష్టపడి బతకాలని అనుకున్న ఆమె ఆదర్శం అందరినీ ఆకట్టుకుంది.

మొదట పదిలీటర్ల పాలు తీసుకుని ఆమె విక్రయించేది.

గ్రామస్తులు రూపాయి తక్కువ చేయడం వల్ల లీటరుకు ఒక రూపాయి మిగిలేది. అమ్మే రేటు రూపాయి అదనంగా ఉండటం వల్ల అదనంగా ఒక రూపాయి కలిపి లీటరుకు రెండు రూపాయలు మిగిలేవి. రోజుకు ఇరవై లీటర్ల పాలు అమ్మడం ద్వారా నలభై రూపాయల ఆదాయం లభించేది.

సుల్తాన్‌పూర్‌కు అయిదు కిలోమీటర్ల దూరంలో టీ కొట్లు, సిమెంటు కర్మాగారంలో పనిచేసే సిబ్బందికి పాలను సరఫరా చేయడంతో అందరిలోనూ మంచిమనిషిగా గుర్తింపు పొందింది. రోజూ ఉదయాన్నే క్రమం తప్పకుండా చిక్కటి పాలను అందించడంవల్ల చాలామంది పాలు కావాలని ఆమెనే కోరేవారు.

కూడబెట్టిన సొమ్ముతో రెండుగేదెలను కొంది.

ఉదయం ఎనిమిది గంటలకు పాలు పోయడం అయిపోగానే గేదెలను మేపేది. ఆ గేదెల పాలు కూడా అదనంగా చేరడంతో మరికొంతమందికి సరఫరా చేయగలిగేది.

ఆ సమయంలో పాలు పోయడానికి వెళ్లిన సమయంలో కొత్తగా ఇంటిలో చేరిన బ్యాంకు మేనేజర్ మంక్తికి పరిచయం అయ్యారు. కొత్తగా మేనేజర్ ఉద్యోగం రావడం, పెళ్లి కాకపోవడం వల్ల మేనేజర్ వంటరిగా ఉండేది. ఆమెతో పాటు ముసలితల్లి మాత్రం ఇంటిలో ఉండేది.

మంక్తి పాలుపోయడం చూసి ఆమె వివరాలు అడిగింది.

చిన్న వయసులో ఉద్యోగం చేస్తున్న మేనేజర్‘ను చూసి ఎంతో సంబరపడింది. తనకు చెల్లెలు ఉంటే ఇలాగే ఉండేదేమో అనుకుంది. ఇంటిలో మనిషిగా తన జీవితం మొత్తం విప్పి ఆమెకు చెప్పేసింది.

"రోజుకు ఎంత సంపాదిస్తావు. నెలకు ఎంత మిగుల్చుకోగలవు? " బాంకు మేనేజర్ అడిగింది. "ఖర్చులు మినహాయించి అయిదువందల రూపాయలు మిగుల్చుకోగలను..." మంక్తి చెప్పింది.

మరిన్ని వివరాలు తీసుకున్న తర్వాత మంక్తి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న తర్వాత బాంకు మేనేజర్ రుణానికి సిఫార్సు చేసింది. అందుకు అవసరమైన పత్రాలను సమర్పించింది. సంతకాలు తీసుకున్నారు.

బాంకువారు దగ్గరుండి ఎనిమిది గేదెలను కొనిపెట్టారు.

ఎనిమిది గేదెలతో పాటు తన దగ్గరున్న రెండు గేదెలను కలిపి పందింటి కోసం ఇంటి ముందు చిన్న షెడ్డు వేసింది. రోజూ యాభైలీటర్ల పాలు లభించేవి. గేదెలను చూడటానికి సంరక్షించడానికి పిల్లలకు బాధ్యతల్ని అప్పగించింది.

తల్లి చేస్తున్న పనికి పిల్లలు సాయపడ్డారు. పాలవల్ల వస్తున్న ఆదాయంలో ఖర్చులకు ఉంచుకుని మిగిలిన సొమ్మును ఎప్పటికప్పుడు బాంకులో తీసుకున్న రుణానికి జమచేసేది.

క్రమం తప్పకుండా బాకీ తీరుస్తున్న మంక్తిని చూసినప్పుడల్లా... తాను రుణం కోసం మంచి వ్యక్తినే బాంకుకు సిఫార్సు చేసానని బాంకు మేనేజర్ భావించేది. తనకు తెలిసిన వారందరికీ పాల ఖాతాలను అప్పగించేది.

ప్రతిరోజూ నలభై యాభై లీటర్ల పాలను తీసుకుని అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి కాలినడకన వెళ్లి పాలు పోసేది. తక్కువ పాలు ఉన్న సమయంలో పని వెంటవెంటనే పూర్తయ్యేది. పాలు ఎక్కువ కావడం, పాలఖాతాదారుల సంఖ్య పెరగడం వల్ల పాలు ఇవ్వడం కష్టం అయ్యేది.

ఆ సమయంలో మంక్తికి సైకిల్ ఆలోచన వచ్చింది.

పాత సైకిలును కొనుగోలు చేసింది.

నలభై సంవత్సరాల వయసులో సైకిల్ తొక్కడం నేర్చుకుంది. మొదట ఎంతో కష్టం అనిపించింది. వారం పదిరోజులు సాయంత్రం పూట గేదెలు మేసే రోడ్డులో సైకిలు తొక్కడం ప్రాక్టీసు చేసింది. క్రమంగా బ్యాలెన్సు కీపింగ్ తెలిసింది.

ఆ మర్నాటి నుంచి సైకిల్‌పై పాలయాత్ర మొదలైంది.

పెద్ద పాలకేన్‌లు తగిలించుకుని సైకిల్ తొక్కుకుంటు ఇంటింటికి వెళ్లి పాలు పోసేది.

ఆ సమయంలో బాంక్ మేనేజర్‌కి బదిలీ అయిపోయింది.

"అమ్మగారూ! ఎప్పుడైనా ఈ ప్రాంతం వస్తే జంటగా రండి!" అంది.

మేనేజర్ ఇల్లు ఖాళీచేసి తల్లితో వెళ్ళిపోయింది.

* * *

మధ్యాహ్నం రెండుగంటలైంది.

సుల్తాన్‌పూర్ తండా ప్రశాంతంగా ఉంది.

తెల్లటి కారు తండాలోకి దూసుకువచ్చింది. కారులోంచి బ్యాంకుమేనేజర్ భర్తతో దిగింది. అతని చేతిలో చిన్నసైజు డిజిటల్ కెమెరా ఉంది. తండాలో గిరిజనులంతా కారుచుట్టూ చేరి ఆసక్తిగా చూస్తున్నారు.

"ఇక్కడ మాలోతు మంక్తి అనే పాలావిడ ఉండేది. ఇల్లు ఎక్కడ? " అడిగింది మేనేజర్

అందరూ దూరంగా ఉన్న కొత్త పాకవైపు చూపించారు.

దూరంగా అందమైన పాక.. దానిని ఆనుకుని చిన్న సైజు డెయిరీ ఫారం కనిపిస్తున్నాయి. దగ్గరికి వెళితే ఇద్దరు పని కుర్రవాళ్లు గేదెలను కుడితి పెడుతున్నారు.

హడావిడి చూసి మంక్తి బైటికి వచ్చింది.

బ్యాంకు మేనేజర్‌ను చూసి కళ్లు విప్పార్చింది.

"నేను అన్నట్లుగానే అయ్యగారితో వచ్చారు. మూడేళ్లలో మీరు రంగుమారారు. బాగున్నారా అమ్మా! ఇంకా పెద్ద ఉద్యోగంలోకి వెళ్ళిపోయి ఉంటారు..." మంక్తి సంబంధం లేకుండా ప్రశ్నల వర్షం కురిపించింది.

"మీ పాలమ్మాయి బాగానే డెవలప్ అయింది. వ్యాపారం కూడా బాగున్నట్లుంది..." అంటూ ఆ ఇంటిని పరిసరాలను, మంక్తిని రకరకాల ఫోటోలు తీశాడు.

ఆ తర్వాత వారి మధ్య ఎన్నో మాటలు.

పాలు అమ్మే వ్యక్తి వద్దకు కారులో చుట్టాలు వచ్చారన్న విషయం తెలిసి మరింతమంది గుమిగూడారు.

"మూడేళ్లలో ఏం జరిగిందో చెప్పు మంక్తీ!"

మంక్తి సిగ్గుపడింది.

"అమ్మా! మీరిచ్చిన బాంకు అప్పు తీరిపోయింది. పెద్దమ్మాయికి పెళ్లి చేశాను. రెండవ అమ్మాయి కుట్టు నేర్చుకుంటోంది. మూడోది, బాబును ఇంగ్లీషు మీడియం పాఠశాలలో చదివిస్తున్నాను." ఆ మాటలు చెబుతున్నప్పుడు ఆమె కళ్లల్లో మెరుపులు.

"ఏమీలేని స్థితి నుంచి ఈ స్థాయికి స్వయంకృషితో ఎదగడం గొప్ప విషయం, నీవంటి వారు ఎందరికో ఆదర్శనీయులు మార్గదర్శకులు." బాంకు మేనేజర్ అభినందించింది.

"మంక్తి జీవితం మా పుస్తకంలో కథగా వేయవలసిందే" ఆమె భర్త ముక్తాయింపు ఇచ్చాడు.

వారి మాటలు ఆమెకు అర్థం కాలేదు. రెండు గ్లాసుల్లో వేడిపాలు ఇచ్చింది మంక్తి. తాగి... "పాలు నీలాగే స్వచ్ఛంగా చిక్కగా ఉన్నాయి! " అంటూ కారు ఎక్కారు.

ఇదొక సునామీ సుమీ...!

త్రినేత్రి



ఏమైతేనేం...నాయనమ్మకు సునామీ అనేపదం బాగా అర్థమయిపోయింది.

సైన్స్ ప్రకారం అర్థమయ్యిందా లేక మరో రకంగా అనేది కాదుకానీ... సునామీ అనే మాట తెగ వాడేస్తోంది.

మాకెవ్వరికీ తెలియదు...ఆ రోజు మేం అప్పటికి పక్కమీద నుంచి లేవనేలేదు. వంటపని చూసుకుంటూనే నాయనమ్మ...

ఒసేవ్...సుజాతా... ఆ టీవీ సౌండ్ కొంచెం పెంచండే...అదేవిటో నానా బీభత్సం జరిగిపోతోందని... ఏదేదో చూపిస్తున్నాడని అనేంతవరకూ మేమూ చూడలేదు.

అలా టీవీలో జరిగిన భయానక విలయం చూసీ చూసీ... పేపర్లలో పడింది నా చేత చదివించుకుని వినీ వినీ... మా నాయనమ్మ ఆ వినాశనానికంతటినీ ఒకే పదంలో పొదిగిన పదంగా సునామీని బాగా గుర్తుపెట్టుకుని ఉంటుంది.

ఆ పదం మీద ఎంత కోపం నింపుకుందో... దానినొక తిట్టుగా కూడా అప్పుడప్పుడు ప్రయోగిస్తోంది.

ఏ పిల్లికూనో పాలగిన్నెలో మూతెడితే నిన్ను సునామీ ఎత్తుకెళ్లా...అని శాపనార్థాల భాషగా కూడా అనువదించేసుకుంది.

ఇష్టంలేని కూర చేసి అది వడ్డించినప్పుడు అయిష్టంగా పెట్టిన నా మొహం చూసి... ఏంటా మొహం ఏదో సునామీ అల నీ మీద పడినట్లు... అని కొన్ని అలల్ని నా మీద, అలాంటివే ఇంట్లో వాళ్ళమీద విసురుతోంది కూడా.

మా ఇంటికి మా నాయనమ్మ ఈడువాళ్ళు వస్తుంటారా...వాళ్ళ సంభాషణ వినాలి.

మనం పనిమాలా వినక్కర్లేదు. మన చెవులు గళ్ళుపడేలా వాళ్ళే మాట్లాడుకుంటారులేండి !

ఒక మామ్మగారు ఇది విన్నావా అక్కయ్యా...అనంటూ మొదలెడుతుంది...మరొకావిడ అదికాదు విష్ణుకాంతమ్మా...అంటూ మరో అంశం జతచేస్తుంది.

ఆ మాటలన్నీ...లేదా కొన్ని మాటలన్నా మా నాయనమ్మకి నచ్చాయెూ...వాటిని తిరుగులేనివిధంగా తన బుర్రలో అట్టేపెట్టుకుని దేనికోదానికి దానిని అన్వయించేస్తుంది.

ఆ పెద్దాయన...పివి నరసింహారావు గారి కర్మకాండలు సరిగా జరవలేదుట కదా...ఆయనగారి కపాలమోక్షం కాకుండానే ఆ చితి ఆరిచచ్చిందట కదా... మరందుకే ఇలాంటి సునామీలు సుమీ...అని కొత్త దీర్ఘం తీస్తుంటే నా తల తిరిగింది.

అదికాదు నాయనమ్మా అంటూ నేను కల్పించుకున్నానో...నీకేం తెలుసునే సుజ్జీ...ఆ కంచి స్వాములోర్ని జైలులో పెట్టింది కాక బయటకే రానియ్యకుండా అడ్డంకుల మీద అడ్డంకులు పెడుతున్నారుట కదే...అలా మితిమీరిపోతుంటే సునామీల మీద సునామీలు వచ్చి పాపం కొట్టేయదుటే...అని మామ్మగార్ల కాలక్షేపపురాణ విశేషాన్నిలా నా మీద కుమ్మరించేసరికి నాకు ఊపిరి అందడం మానేసింది.

ఇక లాభంలేదని నేను కూడా బామ్మల మామ్మల 'సైన్సు' టైపులో మాట్లాడితే కానీ వినేటట్లు లేదనిపించింది.

అది కాదు నాయనమ్మా...ధర్మం కాపాడాల్సినవాళ్ళు సన్యాసాశ్రమ మార్గానుండాలి కదా ! కానీ ఈ స్వాములవార్లు వెండి, బంగారాలు, వేలకోట్ల రూపాయల మఠం ఆస్తులపై పెత్తనం చేస్తుంటే ఇంకేం భక్తీ ముక్తీ వుంటాయి నాయనమ్మా... అదీకాక ఆయనను పీఠం జమాఖర్చులడిగారని, తనను అదిచేయద్దు ఇదిచేయద్దు అంటున్నాడని అడ్డుతగుల్తున్నాయనను హత్యచేయించాడుట. స్వాములోర్లకే అలాంటి బుద్ధులు పుడితే సునామీలొచ్చి భూమి బద్దలైపోదూ నాయనమ్మా...ఈ భూమాత ఈ పాపాలను మోయలేక సముద్రంలో మూడు మునకలేయదూ... అన్నాను.

పాపం నాయనమ్మ నా మాటకూ...మరే...ఆ మునిలాడికిలాంటి బుద్ధులేంటిమరీ...అనికూడా అనేసింది.

ఇక నాయనమ్మను ఆటపట్టించడం మానేసి..

సునామీ బాధితులు ఒక పక్క తమ కొంపా గోడూ కొట్టుకుపోయి శరణార్థులుగా క్యాంపుల్లో ఉంటే మహిళలపై కూడా జరుగుతున్న అత్యాచారాల గురించి వార్తను చదివి వినిపించాను.

సహాయ కార్యకర్తల రూపంలో వచ్చి...

అనునయించే పేరిట ఆ ఆపన్నమహిళలను తాకుతూ...

అసహాయిగా వున్న అతివను అత్యాచారం చేయబూనుతుంటే...

నాయనమ్మ ఇక వినలేకపోయింది.

ఈ సునామీ ఏ కళ్ళకు కనబడుతుంది? ఇలాంటి సునామీగాళ్ళను ఎలా గుర్తించేది? అలాంటివాళ్లలో సుళ్ళు తిరిగే కామవికారపు సునామీలను ఏ రాడార్లు, ఏ రిక్టర్‌స్కేళ్ళు కనిపెడతాయి...అని అన్నాను.

మా నాయనమ్మకు మరో శాపనార్థంపెట్టే ఛాన్సు దొరికింది.

"అవును...ఇదొక సునామీ సుమీ...! కనబడని సునామీ సుమీ...!!"

"కథలన్నీ కంచికి... వాళ్ళంతా ఖైదుకు"

రుక్మిణి

"వెంకటాచారిగారు పూర్లో మిద్దె కద్తున్నారహో... హోం" ! అని వూరు వూరంతా వులిక్కిపడింది. ఆచారి... మిద్దె.. మిద్దె.. ఆచారి...! అబ్బో అంతా మిథ్యని ఊపదశించే ఆచారిగారికి మిద్దె! ఈ విషయం ఎవరికీ మింగుడు పట్టంలేదు.

"నీన్సూసినగద... అబ్బో... అరవై పిల్లర్లు.. పెద్దహాలు... చూస్తంటేనే కండ్లు తిరిగిపోతన్నయి. మరి కింద గక్కదెక్కడిదో తెల్లటి సలవరాయి పరిపిత్తడట.. చుట్టు ప్రహరిగోడ.. గేటుపెట్టి లోపల పూలతోట ఏత్తడట?" గోవిందం గుక్కుతిప్పుకోకుంటా చెప్తంటే అక్కడున్న వీళ్ళందరికీ పరేషాన్ అయ్యింది!

అంతలోనే అక్కడ రావిచెట్టు చప్టా దగ్గర చేరిన జనం 'ఆ మేడ... దాన్లోని వింతలు' గురించి రకరకాల కథలు చెప్పుకుంటుండ్రా... దానిపైనే మరో అంతస్సు కూడా కట్టించేస్తడని కనకయ్యంటే "అదికాదెస్సి... రెండతస్సులు" అని రొమ్ము చరుచుకుంటూ వీరంగం చేసిండు కాంతయ్య.

"అరేబే పైన రెండతస్సులెందుకురా?" జక్కులోడు మటమటలాడుతూ అడిగిండు. రొమ్ము చరుచుకుని "పైన అంతస్సు మొత్తం ఏ.సి. చేసిపారేయిస్తండు. కాస్కో... బస్తీ మే సవాల్!" అని మళ్ళీ కాంతయ్య మూలిగిండు.

"ఏ.సే... వామ్మో!" మల్లేశు నోరు బార్లా తెరిచిండు.

"గంతేగాదుమరి! పట్నంల కెళ్ళి సిన్మాస్టార్లు గిన వస్తే ఆళ్ళకు ఏ.సి.లేంది యాదుంటరు? వాళ్ళూరుకుంటరు? మీదంతా అక్కరకురాని యవ్వారం" "తాగుబోతు గోవిందం వచ్చి రాంగానే బారుచుట్ట వెలిగించి దాంతోబాటి పెద్ద టపాకాయ పేల్చిండు.

ఇంకా సిన్మీస్టార్ల దెబ్బకు చప్టామీది ఎక్కడివాండ్లక్కడ బిగదీసక పోయిండ్రు... ఏ.సి. అంతసులు సినీస్టార్లు... అబ్బా! ఆచారి దశ తిప్పుతుండు... ఎట్లా తిరుగుతందీ అని అమాంతం చర్చల్లోకి దిగిపోయిండ్రు.

"అదికాదురా... మరి ఆచారిగారేమో గుడిపెద్ద పూజారాయే! ఆ జన్మ బ్రెమ్మచారాయె. వయసు కూడా బాగా ముదిరిపోయిందాయె! మరి గీ రోజుల్లో గివన్నీ ఎందుకటా? ఊరూరు తిరిగి వుపన్యాసం చెప్పి... గోచీ పెట్టుకుని 'ధర్మాలు' చెప్పే ఆచారిగారికి గిన్ని సుఖాలమీద గిపుడు ఎట్ల మనసు పడిందో!" ఒక నాటురకం ఆలోచన్ను వీరయ్య బయట పెట్టిండు. దాంతో అప్పటి దాంకా నోర్లు మూసుకుని బిగదీసుకున్న జనాలంతా లపలప మళ్ళీ మాటలకు తగులుకున్నరు.

"యహె...గా గుడికింద వందెకరాల మాగాణి పొలం వుందట గదరా!" వీరయ్య గునిగాడు.

"వందాడిది... అయిదొందలు! అదిగాక గాయనెవరో మార్వాడీ సంఘపోల్లు యాభై కిలోల బంగారం... వామ్మో.. లోపల దర్వాజలకు పూతరేకు ఏయిపించడానికి ఇచ్చిండ్రాయె! గంతబంగారం... అమ్ముకుంటె బోలెడు దబ్బు! నాతానగానీ వుంటే మొత్తం బారాండి షాపులోనే మకాం ఏసేటోడ్ని" తాగుబోతు గోవిందం నిర్వికారంగా ఆకాశం లోకి చేతులెత్తి గొణిగిండు.

యాద్గిరి మాత్రం ఓ కసురు కసిరిండు. "ఎడ్డి మొకాలేసుకుని వదరకండి. ఇపుడు గా గుడికంత సీనులేదు. గుడి మాన్యం నూట యాభై యెకరాలు భూమిని మాద నూరి రెడ్లకు... కాపులకు సవగ్గ లీజులకిచ్చిండాయె! ఇగ గా బంగారంలో పోను పోను మిగిలింది అయి దారు కిలో లేనని గాయన కింద పన్జేసిన శివుడి గుడి పూజారి రామయ్య గంగ వెర్రులెత్తి పోయిండుగాదు. గా నడుమనే రామయ్య పంచెపై కెగదీసి ఆచారిని లెక్కలు డొక్కలు చూపియ్యమన్నడట తర్వాతనే గద రామయ్యను ఎవరో దారికాచి గొడ్డండ్లతో పుర్రెకాయని కొబ్బరికాయమాల్నె అయిదారు ముక్కలు చేసి చంపి పారేసిరి..."

యాద్గిరింకా మాటలు పూర్తి చెయ్యనే లేదు. దూరం నుండి మల్లేశు వురుకులు పరుగుల్తో కిందామీదా పడతా పరుగు లంకించుమని వచ్చి పడిండాయె!

"ఏమైందిరా.... ఎవలన్నా తరిమిండ్రా ఏంది?" జక్కులోడు గాబరాగా అడిగిండు.

"తరుముడు కాదెసె! హత్కడీలు... పోలీసులు...వానుల్ల నూకి తీస్కపోయిండ్రు మన పూజారి ఆచారిగార్ని...గా రామయ్యను గీయనే సంపిచ్చిండంట... లచ్చులు లచ్చులు డబ్బులు కుప్పించి కిరాయి ఖూనీకోర్లను తెప్పించి గింత పని చేయిచ్చిండంట... పోలీసు కుక్కలు కూడా వచ్చె! వామ్మో పూజారయ్యను బొక్కలో నూకిండ్రు...బెయిలు కూడా ఇయ్యరంట...!" రంగయ్య మాటలకు జనమంతా నోర్లు తెరిచి అట్లనే చూస్తుండి పోయిండ్రు.

అందరూ గట్లా ఆగంఆగంగా ఆలోచనల్లో పడ్డపుడు ముసలి గురివిగాడు కీచుకంఠంతో నిమ్మళంగనే అన్నడు. కానీ అది వాడి నాటు 'మందు' లాగానే పెడీలని పేలింది.

"ఆచారి అయ్యగారు రోజూ సాయంత్రాలు సీకట్లు పడ్డంక వయసు ఆడోళ్ళను పిలిపిచ్చుకుని వేదాంత రగిస్యాలు... తత్వాలు బోధన చేస్తడంట...!"

అబ్బో.. ఆచారి గారి వయసేమో... ఎనభైదాకా దాటిపాయె! అక్కడున్నోళ్ళ బుర్రలన్నీ గిర్రున తిరగబట్టినై ఇంగలాభం లేదనుకునేసరికి చీకటిబడ్డది.

అదుగో గపుడు గొర్ల వెంకటగాడు రానేవచ్చె... లపలప ఒకటే వాగుడు మొదలుపెట్టిండు.. "వెంకటచారి పూజారిగార్ని ఖూనీకేసు కింద పోలీసులు అరెస్టుచేసి పట్కపోయిండ్రు. ఇంగ మన గుడిపని... ఛీఛీ దేవుడుండాడు మీ ఇష్టం. మనందరం దీనికి అస్సలు ఒప్పుకోనేవద్దు. అరె ఎంత పోలీసులైతే మాత్రం చిన్నింతరం... పెద్దంతరం సూడద్దా! ఆచారి గారంటే యెవళు? మనందరికి దేవుడు... మనకే కాదు. మన దేశానికే దేముడు. అరె. మనం బస్తాను తోసినట్టు జీపుల తోసి పట్కపోతరే? ఆయన్ది దేవుడి అంశ! ఆయనగార్ని ఖూనీకోరని... ముండల మురాకోరనీ... అడ్డమైన గడ్డిమేసిండనీ కేసులు బనాయిస్తే నేను నా గొర్రెల మందలోని కల్సి గా చెరువులదూకి ప్రాణాలు తీస్కుంటం! గట్ల మీరందరు కూడా మీ పానాలు తీస్కోవాలె! ఆచారె మన దేముడు. పోలీసులు రాకాసులు..."

అట్లా ...గట్లా వాడు శివాలు తొక్కడం మొదలుపెట్టిండు. ఎంతైనా గొర్రె దాటుడు మనిషిగద!

మరి చట్టం దాని పని అది చేసుకుపోతది గద!

కొసమెరుపు:- మొన్ననే సంభవించిన 'సముద్ర భూకంపం' (సునామీ) ఇలాంటి మఠాధిపతులను అరెస్టులు చేసి, బొక్కల్లో నూకడం వల్ల నేనని, మరో 'గుట్టు' ఇంకా బయట పడని మఠాధిపతి వ్యాఖ్య!

హెపటైటిస్ - బి వ్యాధి

హెపటైటిస్ అంటే ఏమిటి?

హెపటైటిస్ అనేది కాలేయాని (లివర్)కి వచ్చే వ్యాధి, దీనిలో నాలుగు రకాలున్నాయి. హెపటైటిస్ - ఎ.బి.సి. మరియు ఇ, వీటిలో హెపటైటిస్-ఎ కి బి వైరస్‌లకు మాత్రమే వ్యాధి నిరోధక టీకాలు (వాక్సిన్‌లు) వున్నాయి. సి, ఇ రకాల నుంచి రక్షణ కల్గించే టీకామందు ఇంకా కనిపెట్టబడలేదు.

హెటటైటిస్‌లోనే కాక ఇతర రోగాలలో కూడా కామెర్లు కనిపించవచ్చు.

రకాలు	అవి వ్యాపించే విధానము
హెపటైటిస్ - ఎ	ఆహార నాళాల ద్వారా వ్యాపిస్తాయి.
హెపటైటిస్ - బి	రక్తం, శరీర ద్రవాల ద్వారా వ్యాపిస్తాయి
హెపటైటిస్ - సి	రక్తం ద్వారా వ్యాపిస్తాయి
హెపటైటిస్ - ఇ	ఆహార నాళాల ద్వారా వ్యాపిస్తాయి

హెపటైటిస్ - బి అంటే ఏమిటి?

ఊపిరితిత్తుల వ్యాధుల్లో చాలా ప్రమాదకరమైనది హెపటైటిస్ - బి. వైరస్‌వల్ల కల్గే ఈ అంటువ్యాధి చివరికి రోగి మరణానికి దారితీస్తుంది. "హెపటైటిస్ - బి" వైరస్ క్రిములు శరీరంలోకి ప్రవేశించిన తర్వాత రక్తప్రవాహం ద్వారా కాలేయాన్ని చేరి మనిషిని తీవ్ర అనారోగ్యానికి గురి చేస్తాయి. కొన్ని సార్లు రోగి జీవించి వున్నంతకాలం ఈ రోగ క్రిములు కాలేయాన్ని అంటిపెట్టుకొని తీవ్రమైన సమస్యలకు గురిచేస్తాయి. ఇలాంటి వారిని 'క్రానిక్ క్యారియర్స్' అంటారు.

ప్రపంచ వ్యాప్తంగా హెపటైటిస్ - బి ప్రతి సంవత్సరం దాదాపు పదిలక్షల మంది రోగులను మరణానికి గురిచేస్తుంది. ప్రపంచ జనాభాలో దాదాపు 200 కోట్ల మంది ఈ ఇన్ఫెక్షన్‌కి గురైన వారు కాగా అందులో 35 కోట్ల మంది ఈ వైరస్ తమలో కల్గివుండి (క్రానిక్ క్యారియర్స్) ఇతరులకు వ్యాపింపజేస్తున్నారు. హెపటైటిస్ - బి క్రానిక్ క్యారియర్స్ వారికే కాక ఇతరులకు కూడా ప్రమాదమే.



ఇన్‌ఫెక్షన్‌కి గురికాగల ప్రమాదం ఎవరికి ఎక్కువగా ఉంది?

ఈ వ్యాధికి గురయ్యే అవకాశం ముఖ్యంగా పసిపిల్లలు, చిన్న పిల్లలకు ఎక్కువగా వుంటుంది. చిన్న పిల్లలు క్రానిక్ క్యారియర్స్‌గా మారే ప్రమాదం కూడా ఎక్కువే. ఉదాహరణకు సంవత్సరంలోపు పిల్లల్లో హెపటైటిస్ - బి ఇన్‌ఫెక్షన్ సోకితే క్యారియర్స్‌గా మారే అవకాశం 80శాతం నుంచి 90శాతం వరకూ



వుంటుంది. ఇదే పెద్దవారిలో అయితే కేవలం 10శాతం మాత్రమే.

హెపటైటిస్ - బి వ్యాధి తీవ్రత

ప్రపంచ జనాభాలో నాల్గింట మూడువంతుల మంది 2శాతం లేక అంతకుమించి ఇన్ఫెక్షన్ ప్రబలివున్న ప్రాంతాలలో నివసిస్తున్నారు. మొత్తం ప్రపంచంలో దాదాపు 35 కోట్లమంది క్రానిక్ క్యారియర్స్ వున్నారు. వీరి ద్వారా రోగం భావితరాల వారికి వ్యాపిస్తుంది. వీరి లివర్‌లో వైరస్ వుండటం వలన భవిష్యత్తులో సిర్రోసిస్‌కి గురికావడమో, క్యాన్సర్ బారిన పడడమో జరుగుతుంది. వ్యాధి తీవ్రతను బట్టి ఆయా ప్రదేశాలను ఎపిడిమియాలజిస్టులు ఈ క్రింది విధంగా వర్గీకరించారు.

8శాతం లేదా అంతకంటే ఎక్కువగా ప్రబలిన ప్రాంతాలను అత్యధికంగా హెపటైటిస్ - బి వ్యాప్తి చెందిన ప్రదేశాలు అంటారు.

2-7శాతం వ్యాధి ప్రబలిన ప్రదేశాలను మధ్యస్థంగా వ్యాపిచెందిన ప్రదేశాలు అంటారు.

2శాతం అంతకంటే తక్కువగా వ్యాధి ప్రబలిన ప్రదేశాలను తక్కువగా వ్యాప్తిచెందిన ప్రదేశాలు అంటారు.

ప్రపంచ అంచనాలు

పెద్దల్లో 25శాతం మంది క్రానిక్ క్యారియర్స్ సిర్రోసిస్‌తో కాని లేదా లివర్ క్యాన్సర్‌తో కాని మరణిస్తున్నారు.

ప్రపంచంలోని పెద్దల్లో కనిపించే ప్రైమరీ లివర్ కాన్సర్‌లు 60శాతం - 80శాతం హెపటైటిస్ - బి వల్ల కలుగుతున్నది.

పురుషుల్లో ముఖ్యమైన కాన్సర్‌లు మరణానికి దారి తీస్తాయి.

అందులో ప్రైమరీ లివర్ కాన్సర్ ఒకటి.

200 కోట్ల జనాభా కొత్తగా వచ్చిన లేక పూర్వం సంభవించిన ఇన్ఫెక్షన్‌ని కల్గివున్నారు.

25 కోట్ల క్రానిక్ క్యారియర్స్ వున్నారు.

10 లక్షల మంది ఏటా ఈ వ్యాధి పరిణామాల వల్ల మరణిస్తున్నారు.

భారతదేశంలో హెపటైటిస్ - బి

మనదేశంలో హెపటైటిస్ - బి క్రానిక్ క్యారియర్స్ 2 -10శాతం మంది ఉన్నారు. ప్రతి 25 మందిలో ఒకరు హెపటైటిస్ - బి క్యారియర్‌గా మారి రోగవ్యాప్తికి దోహదపడుతున్నారు. కేవలం రక్త పరీక్షద్వారా మాత్రమే వీరిలో రోగ నిర్ధారణ జరుగుతుంది.

రోగ వ్యాప్తిని నివారించే పద్ధతులు

హెపటైటిస్ - బి వ్యాధిని పర్యవేక్షించడం.

మరణించిన వారిలో సిర్రోసిస్ కేసుల్ని, లివర్ క్యాన్సర్ కేసుల్ని గుర్తించడం.

సర్వేలద్వారా హెపటైటిస్ - బి వైరస్ యాంటిజన్ పాజిటివ్ కేసుల్ని గుర్తించడం.

హెపటైటిస్ - బి వైరస్ ఏ విధంగా వ్యాప్తి చెందుతుంది?

హెపటైటిస్ - బి వైరస్ ఎయిడ్స్ కంటే 40 - 100 రెట్లు ఎక్కువ ప్రమాదకరమైనది. ఈ వైరస్ ఇన్ఫెక్షన్ సోకిన వ్యక్తుల సీరం, వీర్యం, యోనిస్రావాలు, లాలాజలం మొదలైన శరీర ద్రవాల్లో వుంటుంది. ఈ వ్యాధి ఈ క్రింద తెలిపిన ఇతర మార్గాల ద్వారా కూడా వ్యాపిస్తుంది.

సురక్షితం కాని సెక్స్.

ఇంజక్షన్స్ (కంటామినేటెడ్) ద్వారా డ్రగ్స్ తీసుకోవడం.

రోగియొక్క రక్తాన్ని కాని, గాయాల్ని, పుండ్లని ఆరోగ్య వంతులకు పుండ్లున్నప్పుడు తాకడం వలన ఈ వైరస్ ఆరోగ్యవంతుని శరీరంలోకి ప్రవేశిస్తుంది.

ఇతరుల బ్లేడులు, టూత్ బ్రష్‌లు వాడడం వలన.

పంటిగాట్లు, పసిపిల్లలకు పెద్దలు ఆహారం నమిలి పెట్టడం, చూయింగ్ గమ్‌లాంటి ఎంగిలి చేసిన పదార్థాలు పంచుకోవడం వలన.

స్టెరిలైజ్ చేయని ఇంజక్షన్ ద్వారా ఇమ్యూనైజేషన్ చేయడం వలన.

జనన సమయంలో వ్యాధిసోకిన తల్లి నుంచి బిడ్డకు సంక్రమిస్తుంది.

స్టెరిలైజ్ చేయని సూదుల్ని, చెవులు కుట్టడానికి, ఇతర శరీర భాగాలు కుట్టడానికి, పచ్చబొట్లు వేయడానికి ఉపయోగించుట వలన.

క్యారియర్స్ నుండి సేకరించిన రక్తాన్ని ఆరోగ్యవంతులకు ఎక్కించడం వలన ఈ వ్యాధి వ్యాపిస్తుంది.

హెపటైటిస్ - బి వ్యాధి లక్షణాలు

రోగ లక్షణాలు పెద్దల్లో కన్పించినంతగా పిల్లల్లో,

పసివారిలో కనిపించవు. ఈ వ్యాధి అంతర్గత కాలం (ఇంక్యుబేషన్ పీరియడ్) 45 రోజుల నుండి 160 రోజులు (సగటున 120 రోజులు) వుంటుంది. ఈ వ్యాధి లక్షణాలు సాధారణంగా మూడు దశలలో కనపడతాయి. అవి 1. తొలిదశ 2. పసికర్ల దశ 3. కోలుకునే దశ.

తొలిదశ: కొద్దిపాటి రోగ లక్షణాలు మొదలుకొని పసికర్లు / కామెర్లు కనపడే దాకా తొలిదశ అంటారు. సాధారణంగా ఈ దశ మూడు నుంచి 10 రోజుల వరకు వుంటుంది. ఈ దశలో నీరసం, ఆహారం తినాలనిపించకపోవడం, కడుపులో వికారం, వాంతులు కావడం వుంటాయి.

కామెర్లు కనపడటానికి ఒకటి రెండు రోజులు ముందుగా కడుపులో కుడివైపున పక్క టెముకల క్రింది భాగంలో నొప్పి, జ్వరం, తలనొప్పి, చర్మం మీద మచ్చలు, కీళ్ళనొప్పులు, ముదురు రంగు మూత్రం మొదలైన లక్షణాలు కనబడతాయి.

పసికర్ల దశ: ఈ దశలో కనబడే లక్షణాలు అందరిలో ఒకేలాగ వుండకపోవచ్చు. సాధారణంగా 1 నుంచి 3 వారాల దాకా వుంటుంది. పసికర్లు ఈ దశలో ప్రధాన



లక్షణం. రంగు తక్కువ లేదా బూడిదరంగు మలవిసర్జన అవుతుంది. లివరు ముట్టుకుంటే నొప్పిగా వుంటుంది. స్ప్లీనులో వాపు అరుదుగా వుంటుంది. చర్మం దురదగా వుంటుంది.

కోలుకునే దశ: వ్యాధి నుంచి కోలుకునే దశలో విస్తృత్వ, అలసట కొన్ని వారాలు లేక నెలల దాకా ఉండవచ్చు. జాండిస్ తగ్గి ఆకలి క్రమంగా సాధారణ స్థితికి వస్తుంది. చాలా సందర్భాలలో పెద్దవారిలో హెపటైటిస్ - బి నుంచి పూర్తి స్వస్థత కల్గుతుంది. హెచ్.బి. (హెపటైటిస్ - బి) వైరస్‌కి వ్యతిరేకంగా శరీరం రోగ నిరోధక కణాలను ఉత్పత్తి చేస్తుండటంతో వ్యక్తికి భవిష్యత్తులో కూడా రోగనిరోధక శక్తి కల్గుతుంది.

హెపటైటిస్ - బి వలన కలిగే తీవ్ర పరిణామాలు - నివారణ

చాలాసార్లు ఈ వ్యాధి నుంచి స్వస్థత కల్గుతుంది. కాని కొన్ని సందర్భాలలో ఇది తిరగబెట్టి 63శాతం - 93శాతం మరణాలకు దారి తీస్తుంది. ఏటా దాదాపు 200 నుండి 300 మంది రోగులు ఈ విధంగా మరణిస్తున్నారు. ఒక్కసారిగా ఉధృతంగా వ్యాధితో బాధపడే వారికంటే, ఎక్కువ కాలంగా వ్యాధి వలన బాధపడే వారిలో పరిణామాలు చాలా తీవ్రంగా వుంటాయి.

హెపటైటిస్ - బి చికిత్సా విధానం

ఈ వ్యాధికి కచ్చితమైన చికిత్సా విధానం కనుగొనబడలేదు. ప్రస్తుతం ఈ వ్యాధికి లభించే మందులు వైరస్‌ను వృద్ధి కాకుండా చేయడానికి లేదా శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడానికి మాత్రమే తోడ్పడతాయే తప్ప వ్యాధిని పూర్తిగా నిర్మూలించలేవు.

నివారణ: హెపటైటిస్ - బి, చికిత్సలేని వ్యాధే అయినా టీకాల ద్వారా నివారణ సాధ్యపడుతుంది. సకాలంలో ఈ టీకా మందును సరియైన మోతాదులో ఉపయోగించినట్లయితే 95శాతం హెపటైటిస్ - బి నుంచి రక్షణ కల్గుతుంది. అన్ని వయస్సుల వారికి ఈ వ్యాక్సిన్ సురక్షితమైనది. గర్భిణీ స్త్రీలకు కూడా ఇది సురక్షితమైనదే కాక పుట్టబోయే పిల్లలకు ఈ వ్యాధి వ్యాపించకుండా నివారణ కల్గిస్తుంది. దీనివల్ల కలిగే దుష్పరిణామాలు చాలా తక్కువ.

హెపటైటిస్ - బి వ్యాక్సిన్ 1982వ సంవత్సరం నుంచి లభిస్తున్నది. మానవ క్యాన్సర్‌కు వ్యతిరేకంగా కనుగొన్న మొదటి వాక్సిన్‌గా దీనిని భావించవచ్చు. ఈ వ్యాక్సిన్ రెండు విధాలుగా తయారుచేస్తారు. రోగుల ప్లాస్మానుండి కాని లేదా రీ కాంబినెంట్ డి.ఎన్.ఎ టెక్నాలజీ నుపయోగించి కాని తయారుచేస్తారు. ఇంతవరకు దాదాపు వంద కోట్ల డోసుల వ్యాక్సిన్‌ని ఉపయోగించారు. దీని వాడకం సురక్షితం, నిరపాయకరం.

ప్రపంచ ఆరోగ్య సంస్థవారు హెపటైటిస్ - బి వ్యాక్సిన్ తమ నేషనల్ ఇమ్యూనైజేషన్ షెడ్యూల్‌లో చేర్చమని ప్రపంచదేశాల వారికి సూచన చేయడంతో 2001 నాటికి దాదాపు 130 దేశాలు దీన్ని అమలు జరుపుతున్నాయి. ప్రస్తుతం మన రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు అమలులో ఉంది.

హెపటైటిస్ - బి ఇమ్యూనైజేషన్:

వ్యాక్సిన్ తయారీ: హెపటైటిస్ - బి వ్యాక్సిన్ మోనోవలెంట్ రకం. అనగా ఈ వ్యాక్సిన్ కేవలం హెపటైటిస్ - బి వ్యాధి నుంచి మాత్రమే రక్షణ కల్గిస్తుంది.

సాధారణంగా ఈ వ్యాక్సిన్‌ను 3 డోసుల్లో ఇస్తారు. 1వ డోసుకు, 2వ డోసుకు మధ్య కాలవ్యవధి ఒక నెల. మూడవ డోసు రెండవ డోసు నుంచి 1-12 నెలల కాల వ్యవధిలో ఇస్తారు.

మోనోవలెంట్ హెపటైటిస్ - బి వాక్సిన్

ఈ హెపటైటిస్ వాక్సిన్‌ని ఏ షెడ్యూల్‌లోనైనా ఇవ్వవచ్చును.

పుట్టినప్పుడు తప్పనిసరిగా ఇచ్చే వ్యాక్సిన్‌గా దీన్ని ఉపయోగించాలి.

కంబైన్డ్ వాక్సిన్:

హెపటైటిస్ - బి వాక్సిన్ చిన్న పిల్లలకిచ్చే ఇతర వాక్సిన్లు, మీజిల్స్, డి.పి.టి., పోలియో, ఎల్లోఫీవర్‌తో పాటు ఇవ్వవచ్చు. 0-18 సంవత్సరాల మధ్య వారికి హెపటైటిస్ - 'బి' తప్పనిసరిగా ఇవ్వాలి. ఒకవేళ చిన్నతనంలో ఈ వాక్సిన్ ఇవ్వకపోయినట్లయితే సాధ్యమయినంత తొందరగా పిల్లలకు హెపటైటిస్ - బి వ్యాక్సిన్‌ని ఇప్పించాలి.

పుట్టిన తర్వాత ఆరు వారాల లోపల డి.పి.టి. హెపటైటిస్ - బి వాక్సిన్లు ఇప్పిస్తే వాటి ప్రభావం తగ్గుతుంది. అందుకే పుట్టినవెంటనే టీకా ఇవ్వడానికి ఈ వాక్సిన్‌ను వాడకూడదు.

హెపటైటిస్ - బి వ్యాక్సిన్‌ని జాతీయ షెడ్యూల్‌లో ఎలా చేర్చాలి?

ఈ వాక్సిన్‌ను మన జాతీయ టీకాల షెడ్యూల్ కిఅనుగుణంగా ఎప్పుడున్నా ఏ వాక్సిన్‌తోనైనా కలిపి ఇవ్వవచ్చు. దీనిని ఇతర వ్యాక్సిన్లతో కలిపి ఇవ్వడం వలన లబ్దిదారులు దీని కోసమని ప్రత్యేకంగా రావాల్సిన అవసరం ఉండదు.

వ్యాక్సిన్ ఇచ్చే విధానం:

హెపటైటిస్ - బి వ్యాక్సిన్‌ని ఇంట్రామస్కులర్‌గా అంటే కండరంలోకి ఇస్తారు. ఇంజక్షను ఇచ్చేటప్పుడు పసిపిల్లలైతే తొడముందు భాగానికి అదే పెద్దపిల్లలు, పెద్దవారయితే దండ కండరానికి ఇవ్వవచ్చును.

ఈ వ్యాక్సిన్‌ను డి.పి.టి. మీజిల్స్, బి.సి.జి., ఎల్లో ఫీవర్ వాక్సిన్లతో దేనితోనైనా కలిపికూడా ఇవ్వవచ్చు. ఒకేసారి ఒకటికంటే ఎక్కువ టీకాలు ఇవ్వాల్సివస్తే స్థలం మార్చాలి. ఒకే స్థలంలో ఒకటికంటే ఎక్కువ టీకాలు ఇవ్వరాదు.

ఆరోగ్య విద్యాంశాలు

ఇతరుల బ్లేడులు, టూత్ బ్రష్‌లు వాడకూడదు.

అత్యవసర సమయాల్లో రక్తమార్పిడి అవసరమైతే పరీక్షచేసి హెచ్.బి.వి. (హెపటైటిస్ - బి. వైరస్) రహిత రక్తాన్ని మాత్రమే ఎక్కించాలి.

స్టెరిలైజ్ చేసిన ఇంజక్షన్లతో మాత్రమే ఇమ్యూనైజేషన్ చేయాలి. వివాహేతర లైంగిక సంబంధాలకు దూరంగా వుండాలి. ఈ వ్యాధికి చికిత్స లేదు కావున నివారణ ఒక్కటే మార్గం - అందుకు గాను అన్ని వయస్సుల వారు కూడా హెపటైటిస్ - బి వ్యాక్సిన్ ఇంజక్షన్‌ను మూడు మోతాదులలో చేయించుకోవడం ద్వారా ఈ వ్యాధిని రాకుండా నివారించవచ్చును. ✥

పుస్తక పరిచయం

చైతన్య ప్రతీకలు ఈ "తేనెటీగలు"

బి ఎస్ రాములు సాహిత్యంలో భాగంగా వెలువరించిన 'తేనెటీగలు' కథల సంకలనంలో అన్ని కథలు పాఠకుణ్ణి హత్తుకుంటాయి, ఆకట్టుకుంటాయి. మొత్తం 14 కథలున్నాయి. ప్రధాన సమస్యను తెలియజేస్తూనే వేటికవి ప్రత్యేకతను సంతరించుకున్నాయి. కథల్లో జీవిత చిత్రణ ఉంది.

నాగరిక సమాజానికి దూరంగా ఉన్న ఆటవిక జాతులు దోపిడీకి, అణిచివేతకు గురవుతున్న విధానాన్ని అద్భుతంగా వివరించారు. కథ చదువుతున్నంతసేపూ దృశ్యం కళ్ల ముందు కదలాడుతుంది. పీడితవర్గాలవారు అణచివేతకు గురై ఉద్యమాలవైపు ఎలా వస్తారు, ఉద్యమ కార్యకర్తలను ఏవిధంగా కాపాడుకుంటారనే ఇత్యాది విషయాలను చెప్పారు. మనిషికి భూమికి విడదీయరాని సంబంధం ఉంటుంది. ఉంది కూడా. "మైసవ్వ తాను కోల్పోయిన భూమి తనకు దక్కడంతో మోకాళ్ల మట్టి బురదలో దిగబడి వానకు కొట్టుకుపోయిన గట్లను సరిచేస్తూంటుంది. తన కష్టఫలితం తనకే చెందుతున్నప్పుడు కష్టజీవి కష్టంలోనే ఆనందం పొందుతాడు అంటూ "తల్లీకొడుకులు" కథలో చెప్పారు. సమాజంలోని ప్రజలు ఎలా దోపిడీకి గురవుతున్నది, దానికి కారణాలు, ప్రజలు తమకు తెలియకుండా ప్రభుత్వాలకు ఎలా డబ్బు చెల్లిస్తున్నారనే విషయాలను ఉదాహరణలతో వివరించారు. "రూపులమ్మ చేతిలో సూర్యుడూ ఓడిపోయాడు" కథలో లాగా నేటికీ ఎంతోమంది రూపులమ్మలు మనకు కన్పిస్తారు. "అడవిలో వెన్నెల" కథలో గిరిజన, చెంచు, ఆటవిక జాతుల జీవితాల్లో నిండిన చీకట్లను, ఆవేదనను, ఆక్రందనను మనకు చూపిస్తారు. "ఎనుకటి కాలం మంచిగుండె అని..... వాళ్ల లగ్గాలకు, పండగలకు, పబ్బాలకు ఊరోల్లంతా 'ఎట్టి' జేస్తే ఎనుకట ఎంతప్రేమ..... ఎట్టిజేసినోల్లనడిగితే తెలుస్తది దాని అసలు రంగు" అంటూ ఇతరుల శ్రమపై ఆధారపడి బతికిన దొరల మాటలు, వారు ప్రజల్లో చైతన్యాన్ని ఎలా వ్యతిరేకిస్తారనే విషయాన్ని "ఎనుకటకేముండే" కథలో వివరిస్తారు. "ఎటుచూసిన ఏమున్నది పుట్టిన్నించి పుట్టెడు కష్టాలు తమ బతుకంతా ఇంతే. చిక్కగా పర్చుకున్న నిరాశ, చీకటి తప్ప ఇంకేం మిగిలింది" అని సమ్మక్క తనలోతాను కుమిలిపోతుంది. రాజ్యం జనంపై కొనసాగించే హింసను "మంచిరోజులు" కథలో చెప్పారు.

"అక్కాచెల్లెలు" కథ మనల్ని ఆలోచింపజేస్తుంది. ప్రభుత్వాలు ప్రజలను మోసగిస్తున్న విధానాన్ని విప్పి చెప్పారు. "భూస్వామ్య, వ్యాపార సంస్కృతి పోవాలంటే సరుకులు మారకపు విలువల కోసం కాకుండా వస్తుమార్పిడి, పరస్పర వినియోగం, ఉపయోగపు విలువల కోసం ఉత్పత్తి చేస్తే దోపిడీ అంతం అవుతుంది" అంటారు.

కథారచనలోనూ, పాత్రల సన్నివేశాల ఎంపికలోనూ ప్రత్యేకత, ఒక పద్ధతి ఉంది. కథలన్నీ మనల్ని ఉద్వేగపరుస్తాయి. ఉత్తేజాన్ని కల్గిస్తాయి, ఆలోచింపచేస్తాయి. ఉద్యమ యదార్థ సంఘటనల ఆధారంగా రాసిన ఈ కథలు కడగళ్ల బతుకులకు, కల్లోలిత ప్రాంతాలకు, అట్టడుగు వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవితాలకు అద్దంపడ్తాయి. 1980 దశకంలో రాసినవి అయినప్పటికీ నేటికీ కొన్ని కథల్లో సజీవత కన్పిస్తుంది. అయితే రచయితే ఇందులోని కొన్ని కథలు పాతబడ్డాయా? తెలుగుకథలు తొందరగా ఎందుకు పాతబడుతున్నాయి? ప్రేమ్‌చంద్ కథలు వందేళ్ళయినా ఎందుకు పాతబడవు? అని తనమీద తానే ప్రశ్నలు వేసుకున్నారు. ఇలా ప్రశ్నించుకోవడం రచయిత నిజాయితీ అనిపించినా...బి ఎస్ రాములుగారివి జవాబు తెలియని ప్రశ్నలు కాదనిపిస్తుంది. నిర్దుష్ట పాత్రల రూపకల్పన-వాటి మధ్య చలనం తిరుగులేని విధంగా సామాన్యీకరించినపుడు అవి ఆ సమాజ ప్రతిబింబాలుగా, నమూనా పాత్రలుగా నిలుస్తాయి. చిరకాలం తాజాగా నిలిచిపోతాయి. అలాంటి పాత్రలతో నడిచిన కథలకు పాతబడటం అనేదుండదు. అందుకే ప్రేమ్‌చంద్ కథలు నిత్య నూతనత్వంతో ఉంటాయి. సరిగ్గా ఇలాంటి లక్షణాలున్న కథలు కలకాలం ఉంటాయన్న సంగతి బి ఎస్ గారికి తెలియనిది కాదు. అలాలేనివాటికి కాలదోషం పట్టడం, పాతవాతపడ్డం కూడా సహజమైనదే. వీటిలో కొన్ని కథలు ఎక్కువకాలం తాజాదనం కలిగున్నాయి. ఈ కథల సంకలనం సందర్భంగా వేణు, డా॥సారధి శ్రీనివాస్, వివన్ సిద్ధార్థ ఆప్తవ్యాఖ్యలు, స్నేహవచనాలు, రచయిత స్వంతమాటలు అన్నీ కలిపి 32 పేజీలున్నాయి. బి.ఎస్. రాములుగారి కాలంనాటి, ఆచరణ నాటి రాజకీయ సైద్ధాంతికాంశాలు వారిలాంటి ఆసక్తి కలవారు చదువుకోవచ్చు. లేనివారు ఈ పేజీలు దాటేసి, కథలు చదువుకోవడానికి పోవాల్సివుంటుందేమో !

జి. బుచ్చయ్య



"తేనెటీగలు"

(బి ఎస్ రాములు కథలు)

పుస్తకం వెల: రూ. 75

182 పేజీలు

ప్రతులకు:

బిఎస్.రాములు

2-2-647/ఏ/57

సాయిబాబానగర్,

శివమ్‌రోడ్డు,

హైదరాబాద్ 500013.



హిరణ్యగర్భ (నాటకం)

రచన : డి. విజయభాస్కర్, వెల : 30=00;

ప్రతులకు : శ్రీమతి డి. గౌరీదేవి, 238/2, ఆర్.టి. సెకండ్‌ఫ్లోర్, విజయనగర్‌కాలనీ, హైదరాబాద్, విశాలాంధ్ర అన్ని బ్రాంచీలలోనూ

రత్నమంజూష (బాలల గేయాలు)

రచన : మాల్యశ్రీ వెల : 15=00;

ప్రతులకు : విశాలాంధ్ర, ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, కవి: 13-3-201/1, అశోక్‌నగర్‌కాలనీ, భద్రాచలం.



భారతదేశంలో తాగునీటి హక్కు

ఆంగ్లమూలం: సి. రామచంద్రయ్య, వెల : 6=00;

ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని బ్రాంచీలు;

మనసును దోచే 'విదురాక్షేత్రం'



రాకెట్ల వీరన్న

పెన్నానదీ తీరాన ఆహ్లాదపరిచే వాతావరణంలో, అటవీ ప్రాంతం లో ప్రకృతిమాత ఒడిలో సేద తీరినట్లుగా ఉన్న 'విదురాశ్వర్థక్షేత్రం' చూపరులకు కనువిందు చేస్తోంది. పచ్చని కొబ్బరి, వరి, చెరుకు తోటల మధ్యలో వెలసిన ఈ 'అశ్వర్థక్షేత్రం' పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఏకాంత ప్రదేశంలో ఉన్న ఈ క్షేత్రాన్ని దర్శించిన ఎవరికైనా మనసు పులకరి స్తుంది. కోయిల కుహుకుహూలు, పక్షుల కిలకిలా రావాలు, తుమ్మెదల జుమ్మందినాదాలు వినసొంపుగా, కనువిందు చేసే ప్రకృతి సోయగాలతో ఉంటుంది ఈ ప్రదేశం.

పెన్నానదీ తీరాన ఆహ్లాదపరిచే వాతావరణంలో, అటవీ ప్రాంతం లో ప్రకృతిమాత ఒడిలో సేద తీరినట్లుగా ఉన్న 'విదురాశ్వర్థక్షేత్రం' చూపరులకు కనువిందు చేస్తోంది. పచ్చని కొబ్బరి, వరి, చెరుకు తోటల మధ్యలో వెలసిన ఈ 'అశ్వర్థక్షేత్రం' పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఏకాంత ప్రదేశంలో ఉన్న ఈ క్షేత్రాన్ని దర్శించిన ఎవరికైనా మనసు పులకరి స్తుంది. కోయిల కుహు కుహూలు, పక్షుల కిలకిలా రావాలు, తుమ్మెదల జుమ్మంది నాదాలు వినసొంపుగా, కనువిందు చేసే ప్రకృతి సోయగాలతో ఉంటుంది ఈ ప్రదేశం. ఇక్కడికి ఆంధ్ర, కర్నాటక, కేరళ, తమిళనాడు, మహారాష్ట్రల నుంచే కాక ఉత్తరాది రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. శ్రావణ, కార్తీక, మాఘమాసాలలో ఈ క్షేత్రం సందర్శకులతో కిటకిటలాడుతుంది. పెళ్ళిళ్ళ సీజన్‌లో ఇక్కడ ఒకేసారి వందలాది పెళ్ళిళ్ళు జరుగుతుంటాయి.

పలువురి మనసును దోచే ఈ 'విదురాశ్వర్థం' అనంతపురం జిల్లాలోని హిందూపురం పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో ఉంది. వాస్తవంగా ఇది కర్నాటకలోని కోలార్ జిల్లా గౌరిబిదనూరు తాలూకాలో ఉంది. అనంతపురం జిల్లాసరిహద్దున హిందూపురానికి కేవలం పది కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ఇక్కడి నుంచి నిత్యం బస్సు సౌకర్యం ఉంది. పైగా ఇది హైదరాబాద్ బెంగుళూరు ప్రధాన రహదారిలో ఉండటంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి కూడా చాలా అనుకూలంగా ఉంది. ఇక్కడికి బెంగుళూరు, తుముకూరు, హిందూపురం, పుట్టపర్తి, అనంతపురం నుంచి కూడా బస్సు సౌకర్యం ఉంది. కర్నాటకలోని గౌరిబిదనూరు, ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపురం అతి సమీప రైల్వేస్టేషన్లు. రైళ్లలో వచ్చే వారు హిందూపురం లేదా గౌరిబిదనూరు వచ్చి, అక్కడి నుంచి బస్సులో సులువుగా ఈ క్షేత్రానికి చేరవచ్చు.

ఆపేరెలా వచ్చింది

శ్రీమన్నారాయణుడు 'అశ్వర్థవృక్షం' రూపంలో ఉన్నాడని, ఈ వృక్షాన్ని మైత్రేయుడు నాటగా, విదురుని సమక్షంలో పెరిగినందున ఈ క్షేత్రానికి 'విదురాశ్వర్థం' అనే పేరు వచ్చినట్లు పురాణ గాథ చెబుతోందని స్థానికులు చెబుతుంటారు. దేశంలోని ప్రసిద్ధ క్షేత్రాలలో ఒకటిగా ఇది పేరుగాంచింది. ఇక్కడ ప్రతిష్ఠించిన నాగప్రతిమలు పలువురిని ఆకర్షిస్తున్నాయి. పర్యాటకులు, భక్తులు వారి కోర్కెలు నెరవేరిన తర్వాత ఇక్కడ నాగప్రతిష్ట చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఎంతో అందంగా చెక్కిన నాగప్రతిమలు చూపరులను అడుగు ముందుకు వేయనీయవు అంటే అతిశయోక్తి కాదు.

'విదురాశ్వర్థం' క్షేత్రంలో కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం, నవగ్రహాలు, చెన్నకేశవ, వీరాంజనేయ దేవాలయాలు ఉన్నాయి. వీటికి కొంచెం దూరంలో సత్యనారాయణస్వామి, కన్యకాపరమేశ్వరి, దత్తాత్రేయ మందిరం, రుద్రపాదాలు ఉన్నాయి. ఈ ఆలయాల వెనుక స్వాతంత్ర్య సమరంలో మృతి చెందిన వీరుల స్మారక చిహ్నాంగా నిర్మించిన కట్టడాలు (సమాధులు) ఉన్నాయి.

ప్రతి యేడాది చైత్రశుద్ధ పూర్ణిమ రోజున ఇక్కడ శ్రీ అశ్వర్థ నారాయణస్వామి రథోత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవానికి దేశ నలుమూలల నుంచి జనం వస్తారు. ఇక్కడికొచ్చే వారికోసం మండపాలు, కిరాయికి గదులు, మందిరాలు ఉన్నాయి. ఈ క్షేత్రంలో ఉన్న వటవృక్షాల కింద ఏకాంత ప్రదేశంలో స్వాతంత్ర్య పోరాట మృతవీరులు ఇడగూరు భీమయ్య, నామా అశ్వర్థనారాయణ శెట్టి, నరసప్ప సమాధులు ఉన్నాయి. వారి జ్ఞాపకార్థం 1959లో వాటిని ఇక్కడ నిర్మించారు. గాంధీజీ తన పర్యటనలో భాగంగా ఇక్కడ బస చేసి, స్వాతంత్ర్యోద్యమ నాయకులకు ఇక్కడ శిక్షణా తరగతులు కూడా నిర్వహించారు. ఈ విధంగా విదురాశ్వర్థం పుణ్యక్షేత్రమేకాక, చారిత్రక ప్రదేశంగా కూడా చరిత్రకెక్కింది.

పి.ఆర్.పి. వర్మ

కార్టూన్ బొమ్మల్లో జీవం ఉండాలి

అంతర్జాతీయ స్థాయిలో జరిగిన కార్టూన్ ఫెస్టివల్స్‌లో పాల్గొని ఎన్నో బహుమతులను పొందిన ఫీచర్ కార్టూనిస్టుగా ఎ.వి.ఎం. ప్రసిద్ధులు. విజయవాడకు చెందిన అలపాటి వెంకట మోహన్ గుప్తా గత 35 సంవత్సరాలుగా పదివేలకు పైగా కార్టూన్‌లు ఎ.వి.ఎం. పేరుతో గీసారు. సైలెంటు కార్టూన్‌లు కేప్షన్ లేకుండా గీయడం ఈయన ప్రత్యేకత. తెలుగులో వస్తున్న దాదాపు అన్ని పత్రికల్లో ఈయన కార్టూన్లు దర్శనమిస్తుంటాయి. ఆటవిడుపు, వర్ధమాన, వెలుగు వంటి పత్రికలకు ముఖచిత్రాలు వందలాదిగా చిత్రీకరించారు. సబ్జెక్టు కార్టూన్ల విషయంలో బావా బావా పన్నీరు, చిచ్చరపిడుగు, హైటెక్ వికటకవి, సంసారం వికటకవి, రాజకీయం వంటి విషయాలపై అనేక కార్టూన్లు వివిధ పత్రికల్లో రెగ్యులర్‌గా వేస్తుంటారు. కథా రచయితగా ఎన్నో హాస్య రచనలు చేశారు. కార్టూనిస్టులను సమీకరించి అందరి సహకారంతో సంకలనాలు వెలువరించడం. తరచూ సదస్సులు నిర్వహించడంలో ఉత్సాహం చూపిస్తుంటారు. విశాఖ కళాసాగర్ అవార్డు, కళాసాహితి అవార్డులతో పాటు సారా నిషేధంపై ప్రభుత్వం నిర్వహించిన పోటీలలో అనేక బహుమతులను స్వంతం చేసుకున్నారు. విజయవాడ సత్యనారాయణపురంలో ఉంటున్న ఈయన హోల్‌సేల్ మెడికల్ డిస్ట్రిబ్యూటర్‌గా ఉంటూ హాబీగా కార్టూన్లు వేస్తున్నారు. ఎంతోమంది యువ రచయితలకు మార్గదర్శిగా ఉన్న ఎ.వి.ఎం.తో ముఖాముఖి.

ఆర్టిస్టుగా కార్టూనిస్టుగా ప్రేరణ ఎవరు?

1970లో సరదాగా చిత్రకళ నేర్చుకున్నాను. బొమ్మలు వేస్తుండటంతో కార్టూన్లు గీయడంలో ఆసక్తి పెరిగింది. మొదట గుప్తా పేరుతో కార్టూన్లు గీసాను. ఆ తర్వాత ఎ.వి.ఎం. ఇంగ్లీషు పేర్లతో వేలాది కార్టూన్లు గీసాను. పత్రికల్లో ప్రోత్సాహం లభించడంతో అప్పటి నుంచి కంటిన్యూ చేస్తున్నాను.

ప్రస్తుతం హాస్యం ఎలా ఉంటోంది?

బొమ్మ చూడగానే మొదట నవ్వు రావాలి. తర్వాత డైలాగ్ చదివితే మరింత నవ్వు రావాలి. కాని ప్రస్తుతం వస్తున్న కార్టూన్లు ఆ విధంగా ఉండటం లేదు. హాస్యం ఆరోగ్యకరంగా ఉండాలి. ఎవరినో కించపరుస్తూ నవ్వించడం సరికాదు. హాస్యం ఎప్పుడూ అపహాస్యం కాకూడదు.

పత్రికల తీరు తెన్నులు ఎలా ఉన్నాయి?

పది ఇరవై సంవత్సరాల క్రితం ఎంతో ప్రోత్సాహం ఉండేది. ఏ పత్రిక్కి పంపినా నచ్చిందీ నచ్చలేదు అనే విషయంలో రెస్పాన్సు ఉండేది. ప్రస్తుతం పత్రికల పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. చాలామంది కార్టూనిస్టులు చేతులు ఊరుకోక కార్టూన్‌లు గీస్తున్నారు. ఒకటి రెండు పత్రికలు తప్ప ఏ పత్రిక కూడా పారితోషికాలు ఇవ్వడం లేదు. ప్రచురణ విషయం కూడా చెప్పడం లేదు.

కార్టూన్‌లకు ఎటువంటి శక్తి ఉంది... కార్టూన్లు ఎలా ఉండాలనుకుంటున్నారు.?

పత్రికలు తిరగవేసినవారు ముందు కార్టూన్‌లనే చూస్తుంటారు. రాజకీయాలపై గీసే కార్టూన్‌లు ఎంతో ప్రభావాన్ని చూపిస్తుంటాయి. పత్రికలో హాస్యకథల మాదిరిగా కార్టూన్ కథలు, బొమ్మల కథలు ప్రచురిస్తే బాగుంటుంది. చదివేవారు ఎక్కువమంది ఉన్నప్పటికీ ఎందుకు ప్రచురించడం లేదో అర్థం కావడం లేదు.

మీ అభిమాన కార్టూనిస్టులు, చిత్రకారులు ఎవరు?

బాపు, జయదేవ్, వడ్డాది పాపయ్య, రవివర్మల, కార్టూన్లు, చిత్రాలు, అంటే ఇష్టం.

కొత్త కార్టూనిస్టులకు మీరు ఇచ్చే సూచనలు...

ముందు బొమ్మలు వేయడం నేర్చుకోవాలి. బొమ్మల్లో జీవం ఉండాలి. బొమ్మకు తగిన విధంగా క్యాప్షన్ ఉండాలి. ఒక వర్గాన్నో, వ్యక్తులనో కించపరుస్తూ కార్టూన్లు గీయరాదు. పత్రికల ప్రోత్సాహం కొరవడినా నిరంతరం సాధన చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.



నాకో చెరగని నవ్వు కావాలి

నిన్నటి కదలిక నేటికి స్మృతి
నేటి కలయిక రేపటిపై ఆశ
నా గుండెల్లో జ్ఞాపకాల్లా
ఒక్కో సంవత్సరం ఇంకిపోతూనే ఉంది
క్యాలండర్లు ఒక్కొక్కటీ మాసిపోతూనే ఉన్నై
ప్రతి సంవత్సరం కొత్తగానే వస్తుంది
నేనెప్పుడూ పాతమనిషినే
ప్రతియేడాదీ చిగురుటాకులానే వస్తుంది
ప్రతియేడాదీ వసంత కన్యలానే వస్తుంది
చూస్తుండగానే పండుటాకై రాలిపోతుంది
ప్రతిసారీ నాకోసం నవ్వులు తెస్తుందని చూస్తాను
నేనెన్నడూ నవ్వింది లేదు
ఒక చోట సునామీ, మరోచోట గోద్రా
కాలం నన్నెప్పుడూ కళ్లల్లో పెట్టుకుని చూసుకుందని
రోడ్డుపక్కన మైలు రాయిలా వెళ్లిపోతున్న కాలాన్ని
అసహనంగా చూడ్డం తప్ప నేనేం చేశానని...
ఒంటినిండా గాయాల్ని, నెత్తుటిముద్దల్ని
మూటగట్టుకున్నాను తప్ప నేనేం చేశానని...
సుమత్రా, ఇండోనేషియా, ఇండియా ఎక్కడైనా
కాలానికి కనికరం లేదే
కుంభకోణమైనా..కుంభమేళాయైనా
పాలస్తీనా అయినా కాశ్మీరు అయినా
అన్యాయమైంది నేనేగా.
నిలువునా కాలింది, శవాల దిబ్బలా మారింది
నేనేగా
దుఃఖం కొండచిలువలా నన్ను చుట్టేస్తుంటే
నేనేం చేశాను గనుక
నిజంగా నేనెప్పుడు నవ్వుకున్నాను గనుక
నేనీ రోజు కొత్తగా కనపడాలి
పగిలిపోయిన పెదాలపై రంగులెవరి
కోసం పులుముకోవాలి
ఏ సంవత్సరమైనా ఆకలిలేని
మనిషిని సృష్టించిందా?
ఇంకిపోని జీవనదిని పుట్టించిందా?
నాకు ఎప్పటికీ చెరగని నవ్వుకావాలి.

-వడ్లమూడి వెంకటేశ్వర్లు.

అంతా భ్రమ!

జైలు కెళ్ళిన స్వాములు సమరయోధులట!
'జయ జయ' ధ్వానాలు మ్రోగించుకుంటూ
ఇక స్వాములకు మాలలు వెయ్యండి

పదవీ వ్యామోహం రాజకీయానికే కాదు
ఆధ్యాత్మిక కాషాయమూ ఇప్పుడు నడుంకట్టింది
భక్తులకి ఇక పంగనామాలు పెట్టండి!

నేరాలు ఘోరాలు సాధారణ జీవితంలో కదా...!
అసాధారణం సాధారణమైందిప్పుడు
బేడీలు కేడీలకే కాదు
దణ్ణం పెట్టించుకున్న పాదాలకూ
దణ్ణం పెట్టిన చేతులే వెయ్యక తప్పుతుందా?
విధి ముందు అందరూ సమానులే అని కదా...వీరనేది
ఇక చట్టం ముందు అందరూ సమానమన్నది ఎవరైనా అనేది
తలలో వేలం వెర్రిగా పేరుకుపోయిన
మూఢత్వపు మెదడును బయటకులాగి
శుభ్రం చేసుకోక తప్పదు
భక్తి మూఢత్వాలతో తాళాలు వేసేసుకున్న
ఆలోచనాగదుల్ని తెరవక తప్పదు

నిజం దిగంబరమై
శాంతి ప్రశాంతంగా పారిపోతున్నప్పుడు
వలవేసి పట్టుకోవటంలో మెళకువలు నేర్చుకోండి.



-చలపాక ప్రకాష్

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

అమ్మ ఆస్థి కూతుళ్ళకే

మా అమ్మమ్మ గార్కి ముగ్గురు ఆడపిల్లలు. మగపిల్లలు లేరు. 2 ఎకరాల 70 సెంట్ల పొలం ఉన్నది. అమ్మమ్మ గారు ముగ్గురు పిల్లలకు సమానంగా రాసియిచ్చింది. మా అమ్మ గార్కి మేం ముగ్గురం అక్కచెల్లెళ్ళము, ఒక అన్నయ్య. మా అమ్మగారి వాటాకి వచ్చిన పొలం మా అక్క చెల్లెళ్లకు తెలియకుండా మా అమ్మ గారితో రాయించుకొని పట్టాదార్ పాస్ పుస్తకం పొందాడు. మేము అడిగితే మీకు ఇచ్చేది లేదు. అమ్మ నాకు రాసి ఇచ్చింది అంటున్నాడు.

మా అమ్మగార్కి రాసియిచ్చిన అమ్మమ్మ కంటే మా అమ్మగారు ముందే పోయారు. మాకు వాటా పొందే హక్కుకై న్యాయ సలహా కోరుచున్నాము.

- వెంకమ్మ, భారతి, జ్యోతి

మీ అమ్మగారి వారసులుగా మీరందరూ హక్కుదారులే. మీ అమ్మమ్మగారి కన్నా ముందే మీ అమ్మగారు పోయారన్నారు. మరి మీ అమ్మమ్మగారు ఎవరి పేరు మీద రాశారో తెలుపలేదు. మీ అమ్మగారికి ఆ ఆస్థి పసుపు కుంకుమ కింద వస్తే మీరే వారసులవుతారు. మీరు పాస్‌బుక్ కాన్సిల్ చేయమని ఆర్‌డిఓ వద్ద దరఖాస్తు చేసుకోండి. కోర్టులో పార్టీషియన్ దావా కూడా వేయాల్సి ఉంటుంది. మీకు తప్పక న్యాయం జరుగుతుంది.

ష్యూరిటీ ఉన్నాం... ఏంచెయ్యాలి?

నేను ప్రకాశం జిల్లా మార్టూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేయుచున్నాను. 2003 వరకు మా P.H.C లో U.D.C గా పనిచేసిన డి.ప్రతాప్ బాబు అను అతను A.P.S.T.C - ఒంగోలు నందు లోను తీసుకొనగా నేను, మరి యొక సహోద్యోగి ఇద్దరం ష్యూరిటీలు పెట్టినాము. ఈ లోను సుమారు 7సం॥ క్రితం తీసుకొన్నాడు. కొంత కాలానికి మాకు A.P.S.T.C నుండి లాయరు నోటీసులు వచ్చినాయి. ఈ లోపు ఆ U.D.C కే ప్రకాశం జిల్లా కొరిశపాడు సిండికేట్ బ్యాంక్, మార్టూరు పి.డి.సి.సి. బ్యాంకు లోన్సు కు కూడా ష్యూరిటీలు పెట్టినాము. U.D.C గా అతనే జీత, భత్యముల వ్యవహారం చూచుటవలన డబ్బులు బ్యాంకులకు జమచేస్తున్నాడని భావించాము. అలా జరగలేదు. మిగిలిన రెండు బ్యాంకులనుండి కూడా నోటీసులు వచ్చినాయి. ఈ విషయమై కొంత గట్టిగా అడుగగా 20,000 రూ॥లకు ప్రాంసరి నోటు వ్రాసియిస్తూ పటం కట్టుకొని పూజ చేసుకోమంటూ అవమానకరంగా మాట్లాడాడు. అయినా సహించాను. (తప్పు నాదేలే అనుకొని) ఆ ప్రామిసరీ నోట్‌కు కూడా 3సం॥ దాటిపోయాయి. అది కేవలం అతనికి భయం కలుగుటకు మాత్రమే రాయించుకున్నది. అతను అప్పులు కట్టుకోవడం మానివేశాడు. స్నేహ ధర్మానికి ష్యూరిటీలు గా సంతకం పెట్టినందుకు భయంతో మానసికంగా కృంగిపోతున్నాను. సుమారు ఒక లక్ష రూపాయలకు ష్యూరిటీ పెట్టినాము. బ్యాంకుల నుండి నోటీసులు వస్తున్నాయి. ఏమిటా ఈ మోసం అనుకుంటూ లాయర్లను పెట్టుకొని నెట్టుకువస్తున్నాను. త్వరలో నా జీతంలో కటింగ్ వస్తుందేమో అని భయంగా వుంది. నా మీద ఆధారపడి బతుకుతున్న వారు ముసలి తల్లి, తండ్రీ, భార్య, ఇద్దరు ఆడపిల్లలున్నారు.

అతను ప్రస్తుతం గుంటూరు జిల్లాలోని ఉప్పలపాడు P.H.C. లో పనిచేస్తున్నాడు. L.P.C లో కూడా బ్యాంకు అప్పులున్నట్లు వ్రాసినారు. అయినప్పటికి ఏ బ్యాంకుకు కూడా తన జీతం నుండి డబ్బులు జమ చేయుట లేదు.

ఈ విషయాన్ని ఎవరికి ఫిర్యాదు చేస్తే ఫలితముంటుంది. (జిల్లా కలెక్టరు గారు, జిల్లా వైద్యాధికారి గారు, జిల్లా ఎస్.పి.గారు లేదా సి.ఎం గారు) ఈ పరిస్థితి నుండి బయటపడుట ఎలాగో తెలుపగలరని, న్యాయసలహా ఇవ్వగలరని ప్రార్థిస్తున్నాను.

- ఒక సోదరుడు, మార్టూరు.

మీ ప్రశ్నలోనే మీరు సమాధానం చెప్పుకున్నారు. 'తప్పు నాదేలే' అని. తప్పు చేశారు కాబట్టి అనుభవించక తప్పదు.

ష్యూరిటి అంటేనే అర్థం అతడు చెల్లించక పోయినా, చెల్లించలేకపోయిన మీరు చెల్లిస్తామనే హామీ, మీరు హామీ ఇచ్చారు కాబట్టి ఆ వ్యక్తితో పాటు మీరు బాధ్యులవుతారు. ప్రోనోటు 3 సంవత్సరాలు దాటిపోయిందంటున్నారు. ఆ ప్రోనోటుపై వెనుక భాగాన ఏవైనా కనీసం రు.100 జమ చేసినట్లు అతడితో సంతకం తీసుకోగలిగితే మళ్ళీ అప్పటి నుండి మూడు సంవత్సరాల వరకు చెల్లుతుంది. మీ జీతంతో పాటు అతని జీతంలో కూడా కటింగ్ ఉంటుంది. మీ ప్రోనోటు లేకపోయినా మీ జీతంలో కటింగ్‌ల కోసం అతనిపై మీరు దావా వేసి రాబట్టుకోవచ్చు. సివిల్ కేసులు వ్యక్తిగతం. ఏ అధికారులు అధికారికంగా ఏమీ చేయజాలరు.

రుచి

కొబ్బరితో గోధుమ పిండి బూరెలు

కావలసిన వస్తువులు :

కొబ్బరికాయ	: ఒకటి
బియ్యం పిండి	: పావు కిలో
నూనె లేక డాల్డా	: పావు కిలో
గోధుమ పిండి	: అర కిలో
బెల్లం	: అర కిలో

తయారుచేయు విధానం : గోధుమలు, బియ్యం రాళ్ళు లేకుండా శుభ్రంగా చేసుకొని వేరువేరుగా మర పట్టించుకోవాలి. రెంటినీ జల్లించి కలపాలి. కొబ్బరి చిప్పలను కోరుకోవాలి. యాలకులు పొడి కొట్టాలి. బెల్లం తరిగి వెడల్పాటి మందమైన గిన్నెలో వేసి కొద్దిగా నీళ్ళుపోసి పాకం వచ్చే వరకు ఉంచి కొబ్బరి కోరు, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. పాకం వచ్చిన తరువాత పిండి పోస్తూ కలుపుతూ ఉండాలి. కొద్దిసేపు సన్నని సెగపై ఉంచి దించాలి. నెయ్యి లేక డాల్డా తడి చేసుకుంటూ చిన్న చిన్న ఉండలు చేసి పాల కవరుపై వేసి చేతితో వత్తాలి. బాండీలో డాల్డా వేసి కాగిన తరువాత వీటిని వేయాలి. ఎర్రగా వేయించాలి. వీటిలో ఎక్కువ నూనె పట్టదు. రుచిగా ఉంటాయి. వారం రోజులు నిల్వ ఉంటాయి.

డోనట్స్

కావలసిన వస్తువులు :

బియ్యం పిండి	: ఒక కిలో
పచ్చిమిర్చి	: 10
గసగసాలు	: 50 గ్రాములు
వాము	: ఒక స్పూను
అల్లం	: 10 గ్రాములు
పెద్ద ఉల్లిపాయలు	: మూడు
కొబ్బరి చిప్ప	: ఒకటి (పచ్చిది)
జీలకర్ర	: ఒక స్పూను
నూనె	: అర కిలో

తయారుచేయు విధానం : బియ్యం పిండిని శుభ్రంగా జల్లించుకోవాలి. దీనిని నాలుగు భాగాలుగా చేసి బాండీలో పోసి దోరగా సన్న సెగమీద వేయించుకోవాలి. ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, అల్లం మిక్సీలో వేసి మెత్తగా కాటుకలా వేసుకోవాలి. కొబ్బరి, గసగసాలు మిక్సీలో మెత్తగా వేసుకుని పాలు తీసి పక్కన పెట్టుకోవాలి. వీటన్నింటినీ, ఉప్పు, జీలకర్ర, వాము వేసి కలపాలి. చెక్కల పిండిలాగా కలుపుకోవాలి. పొయ్యి మీద బాండీ పెట్టి నూనె పోసి కాగనివ్వాలి. నూనె కాగాక ఈ పిండిని చిన్న చిన్న చెక్కలుగా వత్తుకొని నూనెలో వేయాలి. కాలిన తరువాత తీసివేయాలి. ఇవి పదిహేను రోజులు నిల్వ ఉంటాయి.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్
- కొత్త కోర్సుల వివరాలు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి.న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'మాథ్స్ స్కిల్స్'
- పోటీ పరీక్షల మెటీరియల్, మోడల్ పేపర్స్
- కెరీర్ గైడెన్స్
- ప్రతివారం ఓ ప్రత్యేక సమాచారం
- 'వ్యక్తిత్వవికాసం'

దీపిక

చందాదారులుగా చేరండి

సమాచారం

మీ ముంగిట నిలుస్తుంది

ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే

ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

అమూల్యమైన సమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ.150లు, పోస్టు ద్వారా రూ.160లు

అర్థసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రు.80లు, పోస్టుద్వారా రూ.85లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ./డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్. ఫోన్: 276645420, 27663761

మేనేజర్: 27673787, ఫ్యాక్స్: 2763921.

Website: www.prajasakti.com, e-mail: prajasakti@hotmail.com